మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 213 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## ఎన్సీ శాసనసభాపక్షనేతగా ఒమర్ అబ్దుల్లా - ఏకగ్రీవ ఎన్నిక



శ్రీనగర్ (ప్రజా మంటలు): జమ్మూకశ్మీర్ లో ఇటీవల వెలువడిన ఎన్నికల ఫలితాలు నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమికి అధికార పీఠాన్ని కట్టబెట్టాయి. ఈ క్రమంలోనే ఎన్సీ శాసన సభాపక్షనేతగా ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా వెల్లడించారు. 90 అసెంబ్లీ స్థానాలున్న జమ్మూకశ్మీర్‌లో మిగతా 3లో..

### తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు

## గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్, (ప్రజా మంటలు): రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు వెళ్లే విధంగా అవకాశం కల్పించాలని తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఏ) చేస్తున్న కృషి ఫలించింది. ఇప్పటికే ఇదే మిగతా 3లో..

### ప్రభుత్వ లాంఛనాలతో రతన్‌టాటాకు

# తుది వీడ్కోలు



- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- హాజరైన అమిత్ షా, సీఎం షిండే
- ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌లు ఘన నివాళి
- వ్యాపార రంగంలో విలువలకు పట్టం కట్టారని వ్యాఖ్య
- రతన్ టాటా పార్సీ అయినప్పటికీ..

ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తి

ముంబై (ప్రజా మంటలు): పారిశ్రామిక దిగ్గజం,టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య పూర్తయ్యాయి. మహారాష్ట్ర ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు పలువురు ప్రముఖులు రతన్ టాటా పార్థివదేహం వద్ద నివాళి అర్పించారు. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు. అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, సిఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటి సిఎం ఫడ్నవీస్, మిగతా 2లో..



### ఆదాయ మార్గాలపై

## దృష్టి సారించండి

- మంత్రులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి సూచన
- రాష్ట్రంలో ఆర్థిక వనరులపై ఆరా తీసిన ముఖ్యమంత్రి
- నిధుల కొరత ఉన్నా హామీల అమలుకు ఇబ్బందులు కలగొద్దన్న సీఎం
- కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపై చర్చ
- సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఇతర ఉన్నతాధికారులు



హైదరాబాద్, (ప్రజా మంటలు): ఆదాయ సమీకరణపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇవాళ తన నివాసంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆదాయ సమీకరణాలకు ఉన్న అవకాశాలను సీఎం ఆరా తీశారు. కేసీఆర్ ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు మోపిందని, అప్పటి అప్పులకు వడ్డీలుకట్టేందుకే రాష్ట్ర ఖజానాలో మెజార్టీ వాటా పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఆదాయ మార్గాలు తగ్గుతుంటే అప్పుల భారం పెరుగుతుంటడంతో ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఈ సమీక్షలో సీఎం చర్చించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీల అమలుతో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలకు ఎక్కడా ఆర్థిక పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించినట్టు సమాచారం. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల విషయంలో సీఎం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.



## హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

హైదరాబాద్, (ప్రజా మంటలు): సుప్రీంకోర్టు సౌత్ ఇండియా రీజినల్ బెంచ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధా నాగేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదే డిమాండ్‌తో దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పోరాటం మిగతా 3లో..

### పొలిట్రిక్స్

బ్రోగిందోయ్ గంట
ఎంపికైన టీచర్ల ఇంట
దసరా బొనాంజా అంట
సర్కారుకు మైలేజీ పంట

ఎట్టకేలకు ముహూర్తం
నిరుద్యోగులకు శుభవార్త,
'జాబ్' క్యాలెండర్ మ్యాటర్
అటకెక్కిన గాలి వార్త !

- న్యాలకంటి నారాయణ
9346200066

## ఊరూవాడా సద్దులబతుకమ్మ సంబరాలు

### ట్యాంక్‌బండ్‌పై వైభవంగా బతుకమ్మ సంబరం

### పలు జిల్లాల్లో వేడుకగా సాగిన ఉత్సవాలు



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే బతుకమ్మ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆడిపాడుతూ సంబురాలు చేసుకున్నారు. మహిళలంతా తీరొక్క పువ్వులతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మ సంబురాలతో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలు వెలుగులీనాయి. వేలాదిమంది తో బతుకమ్మ ర్యాలీ నిర్వహించారు. అలాగే ట్యాంక్ బండ్ పరిసరాలు మహిళల సందడితో కళకళ లాడింది. ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూడి సిఎం మల్లు భట్టి విక్రమార్కలు మిగతా 3లో..

## కొండా సురేఖపై కేటీఆర్ దావా

### - నాగార్జున కేసులో సురేఖకు కోర్టు నోటీసులు



హైదరాబాద్, (ప్రజా మంటలు): మంత్రి కొండా సురేఖపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రత్యేక కోర్టులో ఆయన తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు దీనికి సంబంధించిన పిటిషన్ దాఖలు చేశారు. భారాస నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. ఇటీవల కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ సినీరంగంలోని పలువురిని ప్రస్తావిస్తూ కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. కొండా సురేఖపై ఇప్పటికే ప్రముఖ సినీనటుడు నాగార్జున క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. ఇదిలావుంటే మిగతా 3లో..

## ప్రజా నాడి





## ఏపీకి రూ. 7,211 కోట్లు, తెలంగాణకు రూ. 3,745 కోట్లు

### - కేంద్ర పన్నుల వాటా విడుదల




హైదరాబాద్, (ప్రజా మంటలు): కేంద్ర పనుల్లో రాష్ట్రాలకు చెల్లించాల్సిన వాటాలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు కలిపి దాదాపు రూ.11 వేల కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ. 7,211 కోట్లు, తెలంగాణకు రూ. 3,745 కోట్లు విడుదలయ్యాయి. అన్ని రాష్ట్రాలకు కలిపి రూ.1,78,173 కోట్లు రిలీజ్ చేశారు. అక్టోబరు, 2024లో చెల్లించాల్సిన సాధారణ వాయిదాకు అదనంగా ఒక ముందస్తు వాయిదా వేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ముందస్తు వాటాగా రూ. 89,086.50 కోట్లతో కలిపి మొత్తం రూ. 1,78,173 కోట్లు రిలీజ్ చేసింది. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని కేంద్రం తెలిపింది. రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమ వ్యయాలకు ఆర్థిక సాయం అందించడానికి నిధులు విడుదల చేసినట్లు తెలిపింది.



మొదటి పేజీ తరువాయి

# ప్రభుత్వ లాంఛనాలతో రతన్‌టాటాకు తుది వీడ్కోలు

శక్తికాంద్ దాస్, అంబానీ దంపతులు, ఇతర ప్రముఖులు నివాళి అర్పించారు. హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్య క్రియలు చేస్తారు. అంత్యక్రియ లకు ముందు పార్సీ సంప్రదా యం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం నిర్దేశిరచిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ లేదా దఖ్మా అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీనిగా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చింది అలాగే తిరిగి ఐక్యమవ్వాలని వీరి ఆశయం. పార్సీల సంప్రదాయం ఇలా ఉన్నప్పటికీ..మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారింది. దీంతో సోలార్ లేదా విద్యుత్ విధానంలో దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీరు, అగ్ని, నేల కాలుష్యం కాకుండా జొరాస్ట్రియన్ నియమాలకు అనుగుణంగానే అంతిమ సంస్కారాలు కొనసాగిస్తున్నారు.రతన్ టాటా మరణించిన తర్వాత ఆయన అంత్యక్రియలు ఏ పద్ధతిలో జరుపుతారన్న దానిపై విస్తృత చర్చ జరిగింది. ఆయన పార్దీవ దేహం వద్ద పార్శీ, మస్లిం, క్రిస్టియన్ , సిఖ్ అలాగే హిందూ మతాలకు చెందిన వారు ప్రార్థనలు చేస్తూ కనిపించారు. రతన్ టాటాకు నివాళులు అర్పించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు, వీఐపీలు ముంబైకి తరలి వచ్చారు రతన్ టాటా ఒక్క వ్యాపారవేత్తంగానే కాకుండా సేవతత్పరతో చాలా దేశ ప్రజల మన్ననలు పొందారు. అందుకే ఆయన లేరనే వార్త తెలిసిన తర్వాత అందరూ సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

రతన్ టాటా మరణంపై రేవంత్ దిగ్భ్రాంతి

ప్రముఖ పారిశ్రామిక వేత్త, మానవతావాది రతన్ టాటా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సిఎం కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈరోజు దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన నిష్క్రమణ పారిశ్రామిక రంగానికే కాకుండా యావత్ దేశానికి తీరని లోటు అని అన్నారు. రతన్ టాటా వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తిగానే కాకుండా దాతృత్వానికి ప్రతీక అని ముఖ్యమంత్రి కొనియాడారు. పద్మవిభూషణ్ సహా అనేక గౌరవ పురస్కారాలు అందుకున్న రతన్ టాటా ఇక మన మధ్య లేకపోవడం బాధకరమని అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో విశిష్ట సేవలు అందించారని గుర్తుచేశారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టాటా చారిటబుల్ ట్రస్టు ద్వారా రతన్ టాటా ఎనలేని సేవలు అందించారని, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు రేవంత్. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.

రతన్ టాటా మృతికి కెసిఆర్ సంతాపం

రతన్ టాటా మృతి పట్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు , తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆర్థిక ప్రగతికి మానవత్వాన్ని అద్దిన అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని, సమాజ హితుడుగా.. తాత్వికత, దార్శనిక కార్యాచరణ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. భారత సమాజం గర్వించే ప్రపంచ వ్యాపార దిగ్గజం, పద్మ విభూషణ్ రతన్ టాటా అని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతికి మానవీయ కోణాన్ని అద్దిన మానవతావాది, దార్శనికుడు, పరోపకారి రతన్ టాటా అని కేసీఆర్ కొనియాడారు. అభివృద్ధి ఫలాలు కింది స్థాయికి చేరుకోవాలనే సామాజిక ఆర్థిక తాత్వికతను సొంతం చేసుకున్న అరుదైన పారిశ్రామిక వేత్త రతన్ టాటా అని కేసీఆర్ తెలిపారు. సమాజ సంక్షేమం కోసం, రేపటి తరాల ఉజ్వల భబిష్యత్తు కోసం జీవితకాలం తపించిన రతన్ టాటా ఆదర్శాలు, కార్యాచరణ ప్రపంచ ఆర్థిక పారిశ్రామిక రంగానికి దిక్సూచిగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఒక కార్యక్రమానికి హాజరై., నూతన తెలంగాణ రాష్ట్రం అనతికాలంలో సాధిస్తున్న అభివృద్ధిని అభినందించడం, సాంకేతిక పారిశ్రామిక రంగాల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దార్శనిక కార్యాచరణ పట్ల రతన్ టాటా ఆనందాన్ని వ్యక్తం చేయడం తెలంగాణకు గర్వకారణమని కేసీఆర్ స్మరించుకున్నారు. మానవతావాది రతన్ టాటా మృతి భారత పారిశ్రామిక రంగానికే కాకుండా సమాజ సంక్షేమాన్ని ప్రగతిని కాంక్షించే ప్రతి ఒక్కరికీ తీరని లోటని కేసీఆర్ అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించానని.. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రతన్ టాటా అంత్యక్రియలు పూర్తి.. పార్సీ అయినప్పటికీ!

పారిశ్రామిక దిగ్గజం, టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు పూర్తయ్యాయి. ప్రజల సందర్శన కోసం టాటా పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఎన్‌సీపీఏ గ్రౌండ్‌కు తరలించారు.అనంతరం గురువారం సాయంత్రం అక్కడ నుంచి వర్లీ వరకు కొనసాగిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు. వర్లీ శ్మశానవాటికలో రతన్ టాటా పార్థివదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహించింది. అయితే, పార్సీ మతస్థుడైనప్పటికీ ఎలక్ట్రిక్ విధానంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

భిన్న సంప్రదాయం..

హిందూ, ముస్లింల మాదిరి కాకుండా పార్సీల అంత్యక్రియలు భిన్నంగా ఉంటాయి. మానవ శరీరాన్ని ప్రకృతి బహుమతిగా భావిస్తారు. అందుకే శరీరాన్ని తిరిగి ఇచ్చే సంప్రదాయాన్ని పాటిస్తారు. దహనం, ఖననం చేయడం వల్ల ప్రకృతి వనరులైన నీరు, గాలి, అగ్ని కలుషితం అవుతాయని జొరాస్ట్రియన్‌ల విశ్వాసం. అందుకే ప్రత్యేక విధానంలో అంత్యక్రియలు చేస్తారు.అంత్యక్రియలకు ముందు పార్సీ సంప్రదాయం ప్రకారం ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం పార్థివదేహాన్ని అంత్యక్రియల కోసం నిర్దేశించిన ప్రత్యేక ప్రదేశానికి తీసుకెళ్తారు. దాన్ని టవర్ ఆఫ్ సైలెన్స్ (ఽనీలివతీ నీట రాతిశ్రీవనిఇవ) లేదా దఖ్మా (ఆజీనిష్ట్రఎజీ) అని పిలుస్తారు. రాబందులు వచ్చి తినేందుకు వీలుగా ఆ ప్రదేశంలో పార్థివదేహాన్ని ఉంచుతారు. ఈ మొత్తం పద్ధతిని దోఖ్‌మేనాశీని గా పేర్కొంటారు. మన దేహం ప్రకృతి నుంచి వచ్చింది అలాగే తిరిగి ఐక్యమవ్వాలని వీరి ఆశయం.

రాబందులు లేకపోవడమూ..

పార్సీల సంప్రదాయం ఇలా ఉన్నప్పటికీ.. మారుతున్న పర్యావరణ పరిస్థితులు, రాబందుల సంఖ్య తగ్గిపోవడం వంటి సమస్యల కారణంగా దఖ్మా పద్ధతిలో అంత్యక్రియలు కష్టంగా మారింది. దీంతో సోలార్ లేదా విద్యుత్ విధానంలో దహన వాటికల్లోనే పార్సీలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. నీరు, అగ్ని, నేల కాలుష్యం కాకుండా జొరాస్ట్రియన్ నియమాలకు అనుగుణంగానే అంతిమ సంస్కారాలు కొనసాగిస్తున్నారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా మంత్రులు సంతాపం తెలిపారు. అలాగే ఏపీ కేబినెట్‌లో కూడా రతన్ టాటా మృతి పట్ల సంతాపం తెలియజేశారు.దేశ నిర్మాణంలో కీలక భాగస్వామి రతన్ టాటాకు గౌరవ సూచకంగా ఏపీ కేబినెట్ నివాళులు అర్పించిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఉప్పు నుంచి ఉక్కు దాకా ఆయన పరిశ్రమలు స్థాపించి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. ఏపీ ప్రజలతోనూ ఆయనకు మంచి అనుబంధం ఉందన్నారు. సామాజిక బాధ్యతగా టాటా సంస్థలు ఏపీ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నాయన్నారు. రతన్ టాటా మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కేబినెట్‌ను వాయిదా వేశామని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. కేవలం పారిశ్రామికవేత్తగా మాత్రమే కాకుండా ఉన్నతమైన విలువలు కలిగిన అదర్శవాది రతన్ టాటా అని తెలిపారు. రతన్ టాటా జీవితం అందరికీ ఆదర్శమన్నారు. విద్య, వైద్యం వంటి రంగాల్లో రతన్ టాటా సేవలు అద్వితీయమని కొనియాడారు. కేవలం మన దేశంలోనే కాకుండా 100కు పైగా దేశాల్లో అనేక పరిశ్రమలు స్థాపించి అనేకమందికి ఉపాధి చూపించారన్నారు. రతన్ టాటా ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అని మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. రతన్ టాటా మృతి పట్ల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. రతన్ టాటా మరణం పారిశ్రామిక రంగానికి, ఈ దేశానికి తీరని లోటన్నారు. ఆయన గురించి తెల్సుకోవాల్సినది చాలా ఉంది. ఈ దేశం గొప్ప మానవతావాదిరని కోల్పోయిందన్నారు. విలువలకు నిలువుటద్దం రతన్ టాటా అని... ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం ఆయన నైజమని చెప్పుకొచ్చారు. పుట్టుకతో కోటీశ్వరుడైనా, అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక దిగ్గజంగా ఎదిగినా, సామాన్య జీవనం సాగిగించిన మహోన్నత వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. ఆయనను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మరణంపై రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. రతన్ టాటా మరణం దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటన్నారు. విలువలు, విశ్వసనీయత, మానవత్వం కలబోసిన మహనీయుడు రతన్ టాటా అని.. ఆదర్శప్రాయుడైన రతన్ టాటా జీవితం యువతకు మార్గదర్శకం, అనుసరణీయమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను అని మంత్రి బీసీ జానర్ధన్ అన్నారు. దిగ్గజ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతిపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు రతన్ టాటా వెన్నుముక అని కొనియాడారు. లాభాపేక్ష లేకుండా ఎన్నో పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ విప్లవం సృష్టించిన పారిశ్రామిక వేత్త అని, దేశం కోసం... ప్రజల కోసం... పనిచేసిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా అని.. సేవా కార్యక్రమాల్లోనూ రతన్ సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని, రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. పారిశ్రామిక రంగంతో పాటు సామాజిక సేవా రంగంలో తనదైన ముద్ర వేసిన టాటా గ్రూప్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా మృతిపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సంతాపం వ్యక్తం చేశారు. భారత పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపించి నవతరం పారిశ్రామిక వేత్తలకు ఆదర్శప్రాయులైన గొప్ప వ్యక్తి రతన్ టాటా అని వెల్లడించారు. పారిశ్రామిక రంగానికి మానవత్వం జోడించి పేద ప్రజల సంక్షేమాన్ని ఆలోచించిన మానవతావాది రతన్ టాటా అని కీర్తించారు. దేశమే ముందు అనే సిద్దాంతాన్ని ఆజన్మాంతం ఆచరించిన మహనీయులు రతన్ టాటా అని అన్నారు. దాతృత్వంలో రతన్ టాటాకు ఎవరూ సాటిరారని.. కరోనా సంక్షోభ సమయంలో ఆయన వ్యవహరించిన విధానం, అత్యవసరంగా స్పందించిన తీరు, ఖర్చు చేసిన సొమ్ము వెలకట్టలేని దన్నారు. రతన్ టాటా మరణం దేశానికి, పారిశ్రామిక రంగానికి తీరని లోటుగా వర్ణించారు. రతన్ టాటా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రార్థించారు.










## ఊరూవాడా సద్దులబతుకమ్మ సంబరాలు

సంబురాలకు హాజరయ్యారు. వందలాది మంది మహిళలు 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడిపాడారు. వేలాది మంది మహిళలతో హనుమకొండ పద్మాక్షి అమ్మవారి గుండం కిక్కిరిసిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో మహిళలు భక్తి శ్రద్ధలతో బతుకమ్మ ఆడారు. కరీంనగర్, నల్గొండ, అదిలాబాద్ తదితర జిల్లాల్లో బతుకమ్మ సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఈ సంబురాలు నేటితో ముగిసాయి. తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గురువారం చివరి రోజైన సద్దుల బతుకమ్మ కావడంతో తెలంగాణ గల్లీగల్లీ నుంచి హైదరాబాద్ బస్తీల వరకు వేడుకలు ఆకాశాన్ని అంటాయి. ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో మంత్రి సీతక్క సహా పలువురు మహిళ నేతలు, మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనగా.. మరోపక్క ఊరూవాడా పూలవనంలా మారిపోయింది. మహిళలు, యువతులు, చిన్నారుల ఆటపాటలతో రాష్ట్ర వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. అక్టోబర్ 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగుస్తున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం నుంచే బతుకమ్మ సంబురాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. దీంతోపాటు బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి గౌరవించింది. బతుకమ్మల నిమజ్జనానికి ఊళ్లలో ఉండే చెరువులతో పాటు హైదరాబాద్ వాసులు తమ సమీప నీటి వనరులను ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు రాజ్‌భవన్‌లో జరిగిన బతుకమ్మ వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సతీమణి సుధాదేవ్ పాల్గొన్నారు. గవర్నర్‌గా నియమితులైన తర్వాత తొలిసారి సంబురాలు జరుపుకుంటుండడంతో పూల పండుగ విశిష్టతను అధికారులు గవర్నర్ దంపతులకు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మనకు పూర్వీకులు ఇచ్చిన గొప్ప ఆచారం, సంస్కృతీ బతుకమ్మ అన్నారు. భవిష్యత్ తరాలకు ఈ పండుగను అందించడమే మన బాధ్యత అని, చెరువులను కబ్జాలు కాకుండా కాపాడుకుందామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. ఈ రోజు చెరువులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని, చెరువులకు పూజలు చేసే పండుగ బతుకమ్మ అని, తెలంగాణ అంటేనే చెరువులు అని, బతుకమ్మ చెరువుల్లో నీరు తాగేదని, పొలాలకు నీరు అందించేదని ఆమె తెలిపారు. మన జీవన శైలి చెరువులపై ఆధారపడి ఉందని, హైదరాబాద్‌కు లేక్ సిటీ అని పేరు ఉండేదని, కానీ, ఈ రోజు అవి కనుమరుగు అయిపోయాయని ఆమె తెలిపారు. ఆటలు, పాటలు, బతుకమ్మకు పూజలు ఇది తరతరాలకు అందించాల్సిన అవసరం ఉందని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

ముగిసిన బతుకమ్మ వేడుకలు

హైదరాబాద్ సహా పట్టణాల్లో పత్రేక ఏర్పాట్లు

తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగ తుది అంకానికి చేరింది. గురువారం సద్దుల బతుకమ్మతో పండగ ముగిసింది. ఊరూవాడా తొమ్మిది రోజులుగా బతుకమ్మ పండగ జోరుగా సాగుతోంది. ఆడపడుచుల రాకతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. సద్దుల బతుకమ్మ వేడుకలుకు పల్లెలు మొదలు పట్టణాల వరకు ముస్తాబయ్యాయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా బతుకమ్మను నిర్వహించారు. సిద్దిపేట, వరగంల్ తదితర పట్టణాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఆశ్వయుజ మాసం శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను వేడుకగా జరుపుకున్నారు. రంగురంగుల పూలను త్రికోణాకృతిలో పేర్చి, అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు కొడుతూ..ఆడి, పాడతారు. అప్పుడు మహిళలు పాడే పాటలు మనసుకు హత్తుకుంటాయి. ఏరోజు ప్రత్యేకత ఆ రోజుదే. ఇలా తొమ్మిది రోజులు ఆడిన బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేసి, నైవేద్యంగా పెట్టిన ప్రసాదాన్ని ఆడపడుచులంతా పంచుకున్నారు. తొమ్మిదో రోజు వేడుకగా సద్దుల బతుకమ్మను నిర్వహించి గౌరీదేవిని సాగనంపారు. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి దసరా ముందు శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరుపడం ఆనవాయితీ. ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించుకొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి- అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు. పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది.అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగిస్తారు.

# ఐఏఎస్‌ల కేడర్ మార్పుకు కేంద్రం నో

**- ఐఏఎస్‌లు వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి, వాణీప్రసాద్, ప్రశాంతిలకు షాక్**

**- ఏపీకి కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు**

**- ఐపీఎస్‌లు అంజనీ కుమార్, అభిషేక్ మొహంతిల అభ్యర్థననూ పట్టించుకోని కేంద్రం**

**- ఏపీ వెళ్లాల్సిందేనని.. 16లోగా అక్కడ రిపోర్టు చేయాల ఆదేశాలు**

**- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వారీగా విభజనపై కీలక నిర్ణయం**

హైదరాబాద్ (ప్రజా మంటలు):

తెలంగాణలో కొనసాగుతున్న పలువురు ఐఏఎస్ అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఆయా ఐఏఎస్ అధికారులు వెంటనే ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కొనసాగుతున్న ఆమ్రపాలి కాట, విద్యుత్ శాఖ కార్యదర్శిగా కొనసాగుతున్న రోనాల్డ్ రోస్, వాణిప్రసాద్, ప్రశాంతితో పాటు పలువురు అధికారులను ఏపీ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కేడర్ విభజనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు కేటాయించాలన్న ఐఏఎస్, ఐపీఎస్‌ల అభ్యంతరాలను తోసిపుచ్చింది. వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలి, వాణీప్రసాద్, మల్లెల ప్రశాంతి తదితర అధికారులు తమను తెలంగాణకు కేటాయించాలని కేంద్రాన్ని అభ్యర్థించారు. అయితే, వారందర్నీ తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లాలని కేంద్రం ఆదేశించింది. ఈ మేరకు ఐఏఎస్ అధికారుల పేరుతో లేఖను రాస్తూ.. వాటి కాపీలను తెలంగాణ, ఏపీ చీఫ్ సెక్రెటరీలకు కేంద్రం పంపింది. అయితే, తెలంగాణ కేడర్ కావాలంటూ 11





మంది అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అయితే, అధికారుల వినతిని కేంద్రం తిరస్కరించింది. అధికారులంతా సొంత రాష్ట్రంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొందిన అనంతరం ఆమ్రపాలి కేంద్ర సర్వీసుల నుంచి తెలంగాణ సర్వీసుల్లో చేరారు. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డి ఆమెకు కీలక బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, మూసీ రివర్ ఫ్రంట్ మేనేజింగ్ డైరెక్టర్, హెచ్‌జీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ కమిషనర్‌గా కొనసాగుతున్న సమయంలోనే జీహెచ్ఎంసీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రంలో ఎంతో మంది సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ఆమెకే ఐదు కీలక పోస్టులను సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారు. ఆ తర్వాత జరిగిన బదిలీల్లో మిగతా పోస్టులను నుంచి ఆమెను జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ పోస్టుతోపాటు పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి కాటా అమ్రపాలికి కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ షాక్ ఇచ్చింది. తనను తెలంగాణ క్యాడర్‌లోనే కొనసాగించాలని పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించింది. ఆమెను విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్ కు కేటాయిచారు. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌లో జాయినవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. 2010 బ్యాచ్ కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన అమ్రపాలి తనను తెలంగాణ స్థానికత ఉన్న అధికారిగా గుర్తించాలని చేసిన విజ్ఞప్తిని తోసి పుచ్చారు. ఖండేకర్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ఆమె ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కే చెందుతారని కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన తర్వాత సివిల్ సర్వీసు అధికారుల కేటాయింపు కోసం ఖండేకర్ కమిటీని నియమించారు. ఆ కమిటీ నిబంధనల ప్రకారం విభజించింది. అయితే ఆ నివేదికలో పేర్కొన్న పలువురు తమ క్యాడర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ కేంద్రానికి,క్యాట్‌కు దరఖాస్తుకు పెట్టుకున్నారు. ఏపీకి కేటాయించిన ఎక్కువ మంది తాము తెలంగాణ స్థానికతతో ఉన్నామని తమకు తెలంగాణ క్యాడరే కావాలని ఉండిపోయారు. అలాంటి అధికారి అయిన సోమేష్ కుమార్ ఏపీలో సీఎస్‌గా ఉండగా కోర్టు ఏపీకి వెళ్లాల్సిదేనని స్పష్టం చేసింది. దాంతో ఆయన తెలంగాణ నంచి రిలీవ్ అయి ఏపీలో రిపోర్ట్ చేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. ఇప్పుడు అమ్రపాలికి కూడా దాదాపుగా అదే పరిస్థితి వచ్చింది. హైదరాబాద్ కమిషనర్ గా ఉన్న ఆమె ఉన్న పళంగా ఏపీలో రిపోర్టు చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఖండేకర్ కమిటీ సిఫారసులు చేసిన సమయంలో స్థిర నివాసం అనే కాలమ్‌ను కీలకంగా తీసుకున్నారు. యూపీఎస్సీకి దరఖాస్తు చేసిన సమయంలో కాట అమ్రపాలి తన పర్మినెంట్ అడ్రస్‌గా విశాఖ పట్నంను పేర్కొన్నారు. ఖండేకర్ కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యూష్ సిన్హా కమిటీ ఆ నివేదిక ఆధారంగా క్యాడర్ ను కేటాయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఖండేకర్ కమిటీ ఆమెను ఏపీకి కేటాయించింది. అయితే తనను తెలంగాణ స్థానికురాలిగా పరిగణించి.. తెలంగాణకే కేటాయించాలని ఆమె అప్పీల్ చేసుకున్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ మొదట్లోనే ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. హైకోర్టు కూడా ఖండేకర్ కమిటీ ఆధారంగా ప్రత్యూష్ సిన్హా కమిటీ చేసిన సిఫారసులనే అమలు చేయాలని స్పష్టం చేసింది. కాట అమ్రపాలికి ప్రస్తుతం అన్ని మార్గాలు మూసుకుపోయినట్లేనని ఆమె ఖచ్చితంగా తెలంగాణలో రిలీవ్ అయ్యి.. ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని భావిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత వరంగల్ జిల్లాకు కలెక్టర్ గా చేసిన అమ్రపాలి తర్వాత కేంద్రమంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఓఎస్డీగా.. ప్రధానమంత్రి కార్యాలయంలోనూ పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ తెలంగాణకు వచ్చారు రేవంత్ సర్కార్ లో ఆమెకు కీలక పోస్టులు దక్కాయి. అయితే ఇప్పుడు ఏపీకి తప్పక వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.



## తహసీల్దార్ల ఎన్నికల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

విషయమై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సిసిఎల్ఏ నవీన్ మిట్టల్‌ను పలుమార్లు టిజిటిఏ నేతలు కలిసి ఎన్నికల బదిలీలపై వినతిపత్రాలను అందజేశారు. ఇటీవల రెవెన్యూ మంత్రితో జరిగిన ముఖాముఖి సందర్భంగా ఇదే విషయాన్ని టిజిటిఏ బలంగా చెప్పింది. ఎట్టకేలకు బదిలీలకు సంబంధించిన ఐచ్ఛికాలను ఇచ్చుకోవాలని తహసీల్దార్లకు అవకాశం ఇస్తూ సిసిఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల టిజిటిఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, మహిళా అధ్యక్షురాలు పి.రాధ, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్సింగ్ చౌహాన్ రెవెన్యూ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, సిసిఎల్ఏ నవీన్ మిట్టల్‌కు ధన్యవాదాలు తెలిపారు. అర్హత, ఆసక్తి, అవకాశం ఉన్న ప్రతి తహసీల్దార్ బదిలీకి అవకాశం కల్పించాలని టిజిటిఏ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్సింగ్ చౌహాన్ కోరారు. ఎన్నికల బదిలీల విషయంలో ఇప్పటికే కొంత జాప్యం జరిగిందన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఎన్నికల సమయంలో బదిలీ అయిన ప్రతి తహసీల్దార్ సొంత జిల్లాలకు వెళ్లే విధంగా అవకాశం కల్పించాలన్నారు. ప్రతి ఒక తహసీల్దార్ బదిలీ అవకాశం కల్పించేందుకు టిజిటిఏ కృషి చేస్తుందన్నారు. ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

## హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి



చేస్తున్నా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బుధవారం నల్లకుంటలోని కార్యాలయంలో సుప్రీంకోర్టు న్యాయవాది వినాయక్‌రావు, హైకోర్టు న్యాయవాది భూపాల్‌రాజ్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10న మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నల్లకుంటలోని దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. సమావేశానికి సుప్రీంకోర్టు న్యాయ వాదులు, మేధావులు, పలువురు ప్రముఖులు హాజరవుతారని ఆయన తెలిపారు.

## ఎన్సీ శాసనసభాపక్షనేతగా ఒమర్ అబ్దుల్లా - ఏకగ్రీవ ఎన్నిక

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్సీ- కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. ఫలితాల్లో ఒక్క ఎన్సీనే 42 సీట్లను గెలుచుకోగా.. కాంగ్రెస్ 6 స్థానాల్లో గెలుపొందింది. తాజాగా ఎన్సీకి నలుగురు స్వతంత్ర్య ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. దీంతో ఎన్సీ కూటమి బలం 46 నుంచి 50కి పెరిగింది. కాంగ్రెస్ మద్దతు లేకపోయినా ఎన్సీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగే అవకాశం ఉంది. మరోవైపు.. 29 స్థానాలు గెలుచుకున్న భాజపాకు.. ముగ్గురు స్వతంత్ర్య ఎమ్మెల్యేల మద్దతు లభించింది. కాగా.. జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లా దాదాపు ఖరారయ్యారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే రాష్ట్ర హోదా డిమాండ్ తొలి క్యాబినెట్ తీర్మానమని ఆయన తెలిపారు. అయితే.. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం ఎప్పుడు అనే దానిపై స్పష్టత లేదు. ఎన్సీ-కాంగ్రెస్ కూటమి నేతలు సమావేశంలో ప్రమాణ స్వీకారంపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. అయితే.. అక్టోబరు 11 లేదా 12 తేదీల్లో ఒమర్ అబ్దుల్లా సీఎం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## కొండా సురేఖపై కేటీఆర్ దావా



నాగార్జున పిటిషన్ ఆధారంగా మంత్రి కొండా సురేఖకు నాంపల్లికోర్టు నోటీసులు జారీ చేసింది. తన కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున నాంపల్లి కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. కొండా సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాంటూ ఈనెల 8న కోర్టును కోరారు నాగార్జున. అలాగే వాంగ్మూలం కూడా ఇచ్చారు. సాక్షిగా సుప్రియ వాంగ్మూలాన్ని కోర్టు రికార్డు చేసుకుంది. ఆపై ఈరోజుకు విచారణను వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను ఈనెల 23కు నాంపల్లి కోర్టు వాయిదా వేసింది.

## హామీల అమలుకు రోడ్డెక్కుతున్న రైతన్న

**- అయినా పట్టని రాష్ట్రప్రభుత్వం**

**- కేటీఆర్ విమర్శ**




హైదరాబాద్,(ప్రజా మంటలు):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నదాతలను కష్టాలను వెంటాడుతూనే ఉన్నాయి. రేవంత్ పరిపాలనలో రైతు కంటి నిండా నిద్రపోయే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత విద్యుత్ కోసం పోరాటం, రైతుబంధు కోసం పోరాటం, రుణమాఫీ కోసం పోరాటం.. ఇలా అనేక రకాలుగా అన్నదాతలు రోడ్డెక్కుతూనే ఉన్నారు. చివరకు వరద పాలైన పంటలకు నష్ట పరిహారం చెల్లించడంలో కూడా రైతులను రేవంత్ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. వరదల్లో నిండా మునిగిన రైతాంగాన్ని.. వంచనతో మళ్లీ రేవంత్ సర్కార్ ముంచిందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే.. వేల ఎకరాలకే అరకొర సాయం చేసి చేతులు దులుపుకోవడం అన్యాయం అని మండిపడ్డారు. 4.15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పిన మాటలు.. వ్యవసాయ శాఖ ఇచ్చిన నివేదిక వాస్తవం కాదా..? అని కేటీఆర్ నిలదీశారు. పంట నష్టం అంచనాలను తలకిందులుగా ఎందుకు మార్చేసారు..? ఏకంగా 3 లక్షల 35 వేల ఎకరాలు ఎట్లా ఎగిరిపోయాయి..? 79,574 ఎకరాలకే కంటి తుడుపుగా పరిహారం ఇచ్చి మమ అనిపించడం దారుణం..! అపార నష్టంతో అల్లాడుతున్న రైతుల ఆదుకునే విషయంలోనూ ఉదారంగా వ్యవహరించలేరా..? మానవత్వం ప్రదర్శించలేరా..? 5.20 లక్షల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందని కేంద్ర బృందానికి రాష్ట్రం రిపోర్ట్ ఇచ్చింది నిజం కాదా..? ఇప్పుడు ఇంత భారీ కోతలా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. పెట్టిన పెట్టుబడి కొట్టుకుపోయి.. రాళ్లూ ఇసుక మేటలు వేసిన పొలాలను బాగుచేసుకోవడానికి మీరిచ్చే 10 వేలు ఏ మూలకూ సరిపోవు.. మరి అందులోనూ కుదింపులు చేయడం ఏమాత్రం సమంజసం కాదు..! అన్నదాత ఆపదలో వున్నప్పుడు ఆదుకోవడం.. ప్రభుత్వాల బాధ్యత..! ఆ బాధ్యత నుంచి తప్పించుకోకుండా నష్టం వాటిల్లిన ప్రతి ఎకరానికి పరిహారం అందించండి..! రుణమాఫీలో దగా జరిగింది.. రైతు భరోసా జాడా పత్తా లేదు.. వరదలు ముంచెత్తి నష్టాల్లో.. కష్టాల్లో కూరుకుపోయిన రైతులకు అండగా నిలవట్లేదు..! అన్నదాతపై ఎందుకీ వివక్ష..? అని రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ నిలదీశారు.

## 'జమిలి'ప్రణాళికను రద్దు చేయండి..

**- కేరళ అసెంబ్లీ తీర్మానం**

తిరువనంతపురం (ప్రజా మంటలు):



దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రణాళికను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేరళ కోరింది. ఈ ప్రతిపాదన అప్రజాస్వామ్యమని ఆరోపించింది. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. కేరళ అసెంబ్లీ ఈ మేరకు గురువారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. కేరళ సీఎం పినరయి విజయన్ తరపున ఆ రాష్ట్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ఎంబీ రాజేష్ ఈ తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ప్రతిపాదన దేశంలోని సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. 'ఈ ప్రతిపాదన అప్రజాస్వామికం. దేశంలోని సామాజిక, సాంస్కృతిక, రాజకీయ వైవిధ్యాలను దెబ్బతీసే ప్రయత్నం. ఖర్చులను తగ్గించడానికి, సులభతరమైన పాలనను నిర్ధారించడానికి సులభమైన మార్గాలున్నాయి. రాజ్యాంగంలోని ప్రధానమైన సమాఖ్య నిర్మాణాన్ని నాశనం చేయడం, ప్రజల హక్కులను సవాలు చేయడం, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక స్వపరిపాలన హక్కులను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదన ఉంది' అని అన్నారు.

## హర్యానా ఫలితాలపై కాంగ్రెస్ నిజనిర్ధారణ కమిటీ

**- ఓటమిపై విశ్లేషణ**



న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ ఓటమికి గల కారణాలు తెలుసుకునేందుకు అన్వేషిస్తుంది. అందులో భాగంగానే నిజనిర్ధారణ కమిటీని ఏర్పటు చేయనున్నట్లు సమాచారం. ఈ మేరకు పలు మీడియా కథనాలు ఉటంకిస్తున్నాయి. 'మేము హరియాణా ఎన్నికల ఫలితాలపై సమీక్షా సమావేశం నిర్వహించాం. ఎగ్జిట్ పోల్స్‌కు, ఫలితాలకు చాలా వ్యత్యాసం ఉంది.' అని రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఏఐసీసీ అబ్జర్వర్ అజయ్ మాకెన్ పేర్కొన్నారు. హరియాణా ఎన్నికల్లో వరుసగా మూడోసారి భాజపా విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 90 సీట్లలో 48 చోట్ల విజయ కేతనం ఎగురవేసింది. కౌంటింగ్ ప్రారంభంలో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నప్పటికీ.. 37 స్థానాలకే పరిమతమైంది. అయితే, ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంలపైనా పలు ఆరోపణలు చేశారు. ఫలితాల అనంతరం.. హరియాణాలో అనూహ్య ఫలితాలపై విశ్లేషణ చేపట్టినట్లు కాంగ్రెస్ అగ్రనత రాహుల్ గాంధీ వెల్లడించారు.

## భారత్ మద్దతు వెలకట్టలేనిది

**- కష్టకాలంలో అండగా నిలిచారు - వారి సహకారం మరువలేం**

**- ప్రకటన విడుదల చేసిన మాల్దీవులకు అధ్యక్షుడు ముయిజ్జు**

మాలె (ప్రజా మంటలు):



భారత్ అందించిన ఆర్థిక సహాయం, స్థిరమైన మద్దతుకు మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా క్లిష్టసమయంలో అండగా ఉన్నారంటూ వెల్లడించారు. ఈ మేరకు మీడియా ప్రకటన విడుదల చేశారు. ఐదురోజుల భారత్ పర్యటనను ముగించుకొని స్వదేశానికి చేరుకున్న సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ముయిజ్జు భారత్‌లో అధికారిక పర్యటన చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. రెండుదేశాల మధ్య స్నేహం, భాగస్వామ్యం బలోపేతం అయ్యే విధంగా ఈ చర్చలు జరిగాయని ముయిజ్జు తన ప్రకటనలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. మోదీ-ముయిజ్జు భేటీ సందర్భంగా మాల్దీవుల అవసరాలకు దిల్లీ ప్రాధాన్య మిచ్చింది. భారత్, మాల్దీవుల బంధం శతాబ్దాలనాటిదని వ్యాఖ్యానించిన మోదీ.. ప్రతి సంక్షోభంలోనూ ఆ దేశానికి తొలుత ఆపన్నహస్తం అందిస్తున్నది దిల్లీయేనని గుర్తుచేసిన సంగతి తెలిసిందే. మాల్దీవులకు తాజాగా 40 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. భారత్ సహకారంతో మాల్దీవుల్లో తలపెట్టిన పలు ఇతర అభివృద్ధి ప్రాజెక్టులనూ మోదీ, ముయిజ్జు సంయుక్తంగా ప్రారంభించారు. ఎగ్జిమ్ బ్యాంకు సౌజన్యంతో నిర్మించిన 700 సామాజిక గృహ యూనిట్లను ఆ దేశానికి భారత్ అప్పగించింది. విదేశీ మారక నిల్వల కొరతను అధిగమించడంలో మాల్దీవులకు దోహదపడేలా ఆ దేశంతో కరెన్సీ మార్పిడి ఒప్పందాన్ని దిల్లీ కుదుర్చుకుంది. మాల్దీవుల్లో ఓడరేవులు, రోడ్డు నెట్‌వర్కులు, పాఠశాలలు, గృహ ప్రాజెక్టుల నిర్మాణానికి సహకరించేందుకు ముందుకు వచ్చింది. ఆర్థిక, పర్యాటక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం అయ్యేవిధంగా..రూపే కార్డు చెల్లింపుల సేవలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. వీటిని ఉద్దేశించే ముయిజ్జు తాజా స్పందన వచ్చింది. తమ దేశంలో పెట్టబడులు పెంచేందుకు భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నామని మోదీతో సమావేశం అనంతరం ముయిజ్జు వెల్లడించిన సంగతి తెలిసిందే. తమ టూరిజం మార్కెట్‌కు భారత్ అతిపెద్ద సోర్స్ అని వెల్లడించిన ఆయన.. భవిష్యత్తులో టూరిస్టుల సంఖ్య పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు.

# పత్రికల పంపిణీలో పేపర్ బాయ్స్ నిరుపమాన సేవలు

## పేపర్ బాయ్స్ సేవలను గుర్తించాలి

**అక్టోబర్ 11...అంతర్జాతీయ వార్తాపత్రిక క్యారియర్ దినోత్సవం**



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ఆధునిక సమాజంలో ప్రింట్ మీడియా కన్నా సోషల్ మీడియా వేగవంతంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ ఫోన్ లు అందుబాటు లోకి వచ్చాక డిజిటల్ యుగంలో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం నానాటికీ పెరిగిపోతోంది. అప్డేట్స్ తో వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ మాధ్యమాల ద్వారా విషయం వెనువెంటనే బహిరంగం అవుతుండగా, ప్రింట్ మీడియా వాటి వేగానికి, టెక్నిక్స్ కు పోటీ పడలేక పోతోంది. లైవ్ వీడియోలతో వస్తున్న అంశాలు, బ్రేకింగ్ న్యూస్ కోసం అధిక సంఖ్యాకులు ప్రభావితులు అవుతున్నారన్నది వాస్తవం. నేటి వార్త తెల్లవారి మార్కెట్ లోకి ప్రచురితం అయి వచ్చే సాంప్రదాయ పత్రికల కోసం చాలామంది ఎదిరి చూసే పరిస్థితులు కనిపించడం బాధాకరం. ఒకనాడు నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు వార్తా పత్రికలు మాత్రమే చెరవేసేవి. ప్రభుత్వాలకు ప్రజలకు మధ్యవర్తిత్వం వహిస్తూ వారధులుగా పత్రికలు పని చేసేవి. ప్రజా బాహుళ్యానికి నిత్యం చైతన్య పరుస్తూ, ప్రగతికి బాటలు వేసేవి. ఇప్పటికీ కొన్ని ఆ పనులు చేస్తూనే ఉన్నాయి.

గతంలో దిన, వార, పక్ష, మాస, ద్వైమాసిక, పత్రికలు...సాహిత్య, విద్య, ఉపాధి, పరిశోధన, సినిమా, హాస్య, విజ్ఞాన, ఆధ్యాత్మిక పత్రికలు... చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి పిల్లల పత్రికలు వివిధ రకాలుగా అలరించేవి.

దిన పత్రికలు ప్రాచుర్యాన్ని పొందాక, సమాచార వ్యవస్థ అంతంత మాత్రమే ఉన్న నాటి రోజుల్లో నేటి పేపర్ రేపు, ఉదయం రావాల్సిన పత్రికలు మధ్యాహ్నం పాఠకుల చేతికి చేరేవి. అయితే వేగవంతంగా పాఠకుని గుమ్మానికి పత్రికలను చేర్చేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చి, ప్రచురణ కేంద్రాలను పెంచుకుని, సర్క్యులేషన్లను త్వరితం చేసుకున్నాయి.

అలాంటి స్థితిలో పత్రికలు పాఠకునికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది నిస్సందేహంగా పేపర్ బాయ్. నియమిత స్థలాల్లో పాత్రికేయులు ఆహరహం శ్రమించి, సేకరించి పంపిన వార్తలను ఉప సంపాదకులు సరిచేసి, సంపాదకుని ఆమోద ముద్ర పడిన తర్వాత ముద్రణకు రంగం సిద్ధం చేశాక, ముద్రిత దిన పత్రికలను పాఠకులకు చేరవేయడం లో పేపర్‌బాయ్‌ల కష్టాలు, ఇబ్బందులు అందరికీ తెలిసిందే.

నిర్ణీత ప్రదేశాలలో పంపిణీ వాహనాల కోసం అర్ధ రాత్రి దాటి నప్పటి నుంచి ఎదిరి చూస్తూ, అందుకున్న కట్టలు విప్పి, సెట్లుగా అమర్చుకుని, ఇళ్ళల్లో చందాదారులు, కొనుగోలు దారులు నిద్రలేచి, లేవక ముందే నడిచి లేదా సైకిల్‌పై వెళ్లి గడప గడపకు ఆగి, ముంగిళ్ళలో వేసి, తలుపుల బిడియాలకు చెక్కి పై అంతస్థులో ఉంటే ఎగురవేత ద్వారా వేసిన, వేస్తున్న విషయాలు నిత్య జ్ఞాపకాలే.

స్వాతంత్రోద్యమ సమయంలో లోకమాన్యుడు బాలగంగాధర్ తిలక్ పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్ బాయ్‌గా పనిచేశారు. అలాగే ప్రఖ్యాత శాస్త్రవేత్త, దివంగత భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్ బాయ్‌గా పని చేయడం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రాపూరి భరద్వాజ, తెలంగాణ తొలి బి సి కమిషన్ ఛైర్మెన్, ప్రముఖ తత్వవేత్త, శతాధిక గ్రంథ రచయిత బి ఎస్ రాములుగా చిర పరిచుతులైన బేతి శ్రీరాములు పేపర్ ఏజెంటుగా, బాయ్ గా ఇలా గొప్పవారు పేపర్‌బాయ్‌లుగా పనిచేసిన వారే అన్న విషయం తెలుసు కోవాలి. అమెరికా లాంటి దేశాలలో వృత్తిపరంగా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా, నామోషీ గా భావించక వివిధ కారణాలతో




కొందరు దిన పత్రికలు పంచడం చేస్తుండడం విశేషం.పేపర్ బాయ్ పేరుతో జయశంకర్ దర్శకత్వం వహించిన, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన...సంతోష్ శోభన్, రియా సుమన్ తాన్యా హెూప్, పోసాని కృష్ణ మురళి, అన్నపూర్ణ, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, కల్పలత, సన్నీ, అభిషేక్ మహర్షి, మహేష్ విట్ట తదితర తారాగణం నటించిన ఒక తెలుగు చలన చిత్రం 2018, ఆగష్టు 31న విడుదల కావడం గమనార్హం.

వాస్తవానికి ప్రింట్ మీడియా ఇంకా ఎన్నో రకాల ప్రయోజనాలను కల్పిస్తునే ఉంది. అమెరికా, కెనడా వంటి అనేక దేశాలు తమ ప్రకటనల వాహకాలుగా ప్రింట్ మీడియాపై ఎక్కువగా ఆధారపడు తున్నాయనే విషయం మరిచి పోలేనిది. ప్రభుత్వాలు కూడా చిన్న పెద్ద పత్రికలకు చేయూతను అందిస్తున్నాయి. పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు, ఆరోగ్య వైద్య సదుపాయాలు, ప్రయాణ టిక్కెట్ టికెట్ల రాయితీ గల బస్ పాస్ లు, వివిధ రకాల యాడ్స్ తదితరాలతో ప్రోత్సాహాలను అందించడం జరుగుతున్నది. అలాగే చదువుకోసం, ఆర్థిక స్వావలంబన కోసం, జీవనోపాధి కోసం చాలామంది చాలా పత్రికలకు పేపర్ బాయ్స్ గా పనిచేస్తున్న వారిని ప్రభుత్వాలు, యాజమాన్యాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. చేస్తున్న పని చిన్నదా పెద్దదా అన్నది కాకుండా, వారి సేవలను గుర్తించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

## ఆమని శిఖరం

అజంత శిల్పమే నా ఆంధ్రం
అద్భుత సోయగమే ఆ చందం
మధుర మొలికింది మాధుర్యం
సొగసు చిలికింది సౌందర్యం
వన్నెలొలికింది వయ్యారం
వెన్నెల కాసింది వైభోగం

నా తెలుగే ఆ వేణుగానం
నా పలుకే ఆ వీణా నాదం
నా తళుకే తారా తోరణం
నా పొంగే వెన్నెల జలపాతం
నా హంగే వాసంత సమీరం
నా రంగే కడు రమణీయం

నా పదమే సుమ సుగంధం
నా కథనమే అతి ప్రాచీనం
నా కవితే హారతి కర్పూరం
నా వాక్యమే నవరస భరితం
నా కావ్యమే అష్టాదశ వర్ణనం
నా గ్రంథమే సకల కళాత్మకం

నా ఆట అల కూచిపూడి నృత్యం
నా పాట యల కోయిల సంగీతం
నా మాట ఆ ఘంటసాల గాత్రం
నా తోట ఆ సప్త వర్ణ తోరణం
నా బాట ఆ సామవేద గానం
నా కోట అందాల ఆమని శిఖరం

గుండాల నరేంద్ర బాబు,
9493235992

# జగిత్యాల "జిల్లా" కు జన్మదిన శుభాకాంక్షలు



2016 అక్టోబరు 11 న చేసిన తెలంగాణ జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా అప్పటివరకు మండలంగా ఉన్న జగిత్యాల "జిల్లా" గా ఏర్పడింది.

జగిత్యాల జిల్లా పూర్వ కరీంనగర్ జిల్లా నుండి ఏర్పాటు చేయబడింది. ఈ జిల్లా చుట్టూ నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల, పెద్దపల్లి మరియు కరీంనగర్ జిల్లాలు ఉన్నాయి.

దక్షిణం వైపు కొండగట్టు ఆంజనేయ స్వామి, ఉత్తరం వైపు ధర్మపురి నృసింహ స్వామి, తూర్పున కోటిలింగాల క్షేత్రాలు జిల్లా ప్రజలను చల్లగా రక్షిస్తున్నాయు.

స్వచ్ఛమైన గోదావరి నది కన్న తల్లిగా వ్యవసాయం, నీటి పారుదలను అందిస్తూ జిల్లాలో ఉన్న 360 గ్రామ ప్రజలను అలాగే రాష్ట్ర ప్రజలకు వ్యవసాయం, పంటల దిగుబడి మెరుగ్గా ఇస్తూ ఎంతో సుఖమయ జీవితం అందిస్తుంది.

రైతుల దేవాలయం...పొలాస వ్యవసాయ పరిశోధనాకార్యాలయం, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 1980 డిసెంబర్ 2న జగిత్యాల మండలం పొలాస వద్ద పరిశోధనా క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 150 ఎకరాల విస్తీర్ణంలో క్షేత్రం ఏర్పాటు కాగా,

వరిలో అధిక దిగుబడినిచ్చే రకాల రూపకల్పనలో జగిత్యాల జిల్లా పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం విశిష్ఠతను చాటుతోంది. ముఖ్యంగా అనేక సన్నగింజ వరి వంగడాలు ఇక్కడి నుంచి విడుదలయ్యాయి. రైతుల క్షేత్రాల్లో మంచి ఫలితాలు నమోదు చేస్తున్నాయి.

జగిత్యాల జిల్లా పసుపు, వేరుశెనగ, మిరప, వరి మరియు మామిడికి ప్రసిద్ధి చెందింది.

పండ్లలో రారాజుగా పిలువబడే బెనిషాన్ లేదా బంగనపల్లి రకం మామిడిని జగిత్యాల జిల్లాలో విరివిగా పండిస్తారు మరియు ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలకు మరియు విదేశాలకు ఎగుమతి చేస్తారు, ఇప్పుడు 'జగిత్యాల మామిడి - తెలంగాణ'గా బ్రాండ్ చేయబడుతుంది.

జిల్లాలోని 18 మండలాల్లో మొత్తం 17,700 హెక్టార్లలో మామిడి తోటలు ఉన్నాయి. సగటు ఉత్పత్తి సుమారు 1,24,900 టన్నుల విలువ రూ. 187 కోట్లు పై మాటే.

జగిత్యాల మామిడి పండ్ల నాణ్యత, రుచికరమైన రుచి మరియు ఎక్కువ కాలం నిల్వ ఉండే కాలం కారణంగా జగిత్యాల మామిడి ప్రజాదరణ పొందినందున, ఢిల్లీ, చండీగఢ్, అహ్మదాబాద్, కోల్‌కతా, పూణే, లక్నో మరియు గ్వాలియర్ వంటి ఉత్తర ప్రాంతాల నుండి డిమాండ్ ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి పండ్లతో పోల్చితే జగిత్యాల మామిడి తీపి మరియు నాణ్యత కారణంగా ప్రజాదరణ.

ఒకప్పుడు చిన్న పట్టణంగా ఉండే జగిత్యాల నేడు చుట్టుపక్కల ఉన్న ఊర్లను ఎన్నింటినో తనలో కలుపుకొని ఒక 'పెద్ద పట్టణం'గా రూపాంతరం చెందింది.

రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 'అతి పరిశుభ్రమైన నగరం'గా గుర్తింపు పొందింది.

జిల్లా ఏర్పడినప్పటినుండి రాష్ట్రంలో ఎన్నో విషయాలలో ఘనంగా నిలబడిన జగిత్యాల.

అందులో ముఖ్యంగా :

1. పసుపు పంట ఉత్పత్తి లో జిల్లా రాష్ట్రంలో 02వ స్థానం,
2. స్త్రీ, పురుష నిష్పత్తి 1036 గా రాష్ట్రంలో 03వ స్థానం.
3. తల్లి సంరక్షణ - అనుబంధ పోషణ విభాగంలో 62.9% తో రాష్ట్రంలో నే మొదటి స్థానం.

ఇలా ఎదుగుతోనే కొన్ని విషయాలలో ఇంకా మరింతగా ఎదగాల్సిన ప్రాముఖ్యత ఎంతైనా ఉంది.

ముఖ్యంగా :

1. స్థూల జిల్లా దేశీయ ఉత్పత్తి విభాగంలో 16836 కోట్ల (ప్రస్తుత ధరలలో) తో రాష్ట్రంలో 16 వ స్థానం లో ఉంది.
2. మగ, ఆడ పిల్లల(0-6సం.). నిష్పత్తి 947 గా.
3. తలసరి ఆదాయంలో (88,000) 28వ స్థానం.
4. పాఠశాల సంఖ్యలో 1122 గా 17వ స్థానంలో ఉంది.









5. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి లో 1:20 తో 12వ స్థానంలో.
6. అక్షరాస్యత లో 60% లో కొద్దిగా వెనుకంజ లో ఉంది.
7. జిల్లా తలసరి ఆదాయం రూ. 84,742/- తో రాష్ట్రంలో 29వ స్థానంలో ఉంది.
8. స్కూల్ డ్రాప్ అవుట్ విభాగంలో 13.03% తో రాష్ట్రంలో 20వ స్థానంలో ఉంది.

విద్య, వైద్య, ఆరోగ్య, ఆర్థిక, సామాజిక ఎదుగుదల విషయాలలో ఇంకా ఎంతో మెరుగ్గా రాణించి రాష్ట్రంలో తలమానికంగా జిల్లా నిలబడాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఈ నాడు జిల్లాకు ప్రత్యేక అభినందనలతో కూడిన జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ అలాగే జిల్లా ప్రజలకు కూడా అభినందనలు తెలుపుతున్నాము.

**సిరిసిల్ల. రాజా విక్రాంత్ శర్మ**
**9963349493.**

# రుషితుల్యుడు..మన రతన్ టాటా

భారతదేశం నిజంగానే పుణ్యదేశం...ఈ మట్టి మహిమేమో కానీ పలు సందర్భాల్లో పుణ్యపురుషులు ఉద్భవిస్తూనే ఉంటారు. మన అదృష్టం ఏమంటే రతన్ టాటా లాంటి ఓ పుణ్య పురుషుడిని మనతరంలో మనమంతా కళ్లముందు చూశాం. నమంతా ఇప్పుడు రతన్ టాటా అనే ఓ మహానుభావుడిని ప్రత్యక్షంగా చూశాం. ఆయన గురించి తెలుసుకున్నాం. ఆయన చర్యలను గమనించాం. ఆయన దేశం కోసం తపించి.. ఈ దేశ యువతకు మర్గనిర్దేశనం చేసేందుకు పడిన శ్రమను చూశాం. ఓ పారిశ్రామిక దిగ్గజంలా కాకుండా ఈ దేశాన్ని ముందుకు నడిపించే చోదకుడిలా టాటా ఎప్పుడూ ఆలోచించేవారు. ఇతర పారిశ్రామికవేత్తలకు రతన్ టాటా భిన్నం. ఆయన ఆలోచనలు భిన్నం. ఆయన నడవడి భిన్నం. ఆడంబరాలకు ఆయన దూరం. సన్మానాలంటే పెద్దగా ఇష్టం ఉండదు. రతన్ టాటా జీవితమంతా సింప్లిసిటీకి మారు పేరు. ఆయన జీవితాన్ని పరిశీలిస్తే రామాయణంలో జనకుని పాత్ర లాంటి ఎన్నో ఉదాహరణలు దొరుకుతాయి! అలాంటి ఓ మహానుభావుడు టాటా సంస్థను దిగ్గజ సంస్థగా ప్రపంచ వ్యాపార రంగంలో తీర్చి దిద్దారు. అలాగే నిజాయితీగా వ్యాపారం చేశారు. ఉప్ప నుంచి..విమానం వరకు స్పృషించని రంగాలు లేవు. నిజంగా యువతకు ఆయన ఓ రోల్ మోడల్. ఎలా ఎదగాలో..ఎలా మసలు కోవాలో..ఎలా వ్యాపారాన్ని నిజాయితీగా విస్తరించాలో అన్నదానికి కూడా ఆయన రోల్ మాడల్. తన వ్యాపారం కోసం ఏనాడూ రాజకీయ నేతల చుట్టూ తిరిగిన సందర్భాలు లేవు. ఆయన చుట్టే రాజకీయ నేతలు తిరిగి..తమ రాష్ట్రాల్లో వ్యాపారాన్ని పెట్టాలని అర్థించేవారు. రతన్ టాటా మరణంతో భారత దేశ పారిశ్రామిక చరిత్రలో ఒక శకం ముగిసింది! జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య యవనికపై తనదైన ముద్ర వేసిన పారిశ్రామిక వేత్త, చైర్మన్ ఎమెరిటస్ ఆఫ్ టాటా సన్స్.. రతన్ నావల్ టాటా (86) ఇక లేరు అన్న విషయం నిజంగానే జీర్ణించుకోలేని వార్త. దేశం కోసం తపించిన ఓ తపస్వి నింగికేగాడు. తన జ్ఞాపకాలను , తన వ్యాపార సామ్రాజ్యాన్ని మనకు వదిలేసి కనిపించని లోకాలకు చేరుకున్నాడు. ఎంతటి పుణ్యం చేసుకుంటే తప్ప ఇంత గొప్ప జన్మ దక్కదు. వంటగదిలో వాడే ఉప్పు నుంచి.. ఆకాశంలో ఎగిరే విమానాల దాకా.. ఎన్నెన్నో ఉత్పత్తులు, సేవలతో భారతీయుల నిత్యజీవితంలో భాగమైన టాటా సామ్రాజ్యాన్ని రెండు దశాబ్దాలపాటు నడిపించిన ఆ పారిశ్రామిక దిగ్గజం.. మరలిరాని లోకాలకు తరలిపోయారు! అత్యంత నిరాడంబరంగా జీవించిన రతన్ టాటా అవివాహితుడు. ముంబయిలోని అత్యంత చిన్న ఇంట్లో ఆయన నివసించేవారు. తన టాటా సెడాన్ కారును ఆయనే నడిపేవారు. ప్రైవసీని ఎక్కువగా ఇష్టపడేవారు. మీడియా ప్రచారానికి దూరంగా ఉండేవారు. తనతోపాటు పుస్తకాలను, సీడీలను, పెంపుడు కుక్కలను ఉంచుకునేవారు. రతన్ టాటా సేవాగుణంలో అత్యున్నతుడు. 1970లలోనే ఆయన సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఆగాఖాన్ ఆసుపత్రి, వైద్య కళాశాలకు శ్రీకారం చుట్టారు. 1991లో ఆయన టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టాక, టాటా గ్రూప్ సేవా కార్యక్రమాలు కొత్త రూపును సంతరించుకున్నాయి. టాటా ట్రస్టులను మరింతగా విస్తరించారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌ను స్థాపించారు. విద్యా రంగానికి మరింత ప్రోత్సాహమిచ్చారు. దేశంలోని అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యానికి అధినేత రతన్‌టాటా. కానీ, ఆయన ఎంతో వినయంగా ఉంటారు. ప్రచారాలకు, ఆర్భాటాలకు దూరంగా.. సాధారణ జీవనశైలితో ఉండటానికి ఇష్టపడతారు. రతన్ టాటా నాయకత్వంలో.. టాటా గ్రూప్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది, జాగ్వార్, ల్యాండ్ రోవర్, కోరస్ స్టీల్ వంటి పెద్ద పెద్ద కంపెనీలను కొనుగోలు చేసింది. ఆయన టాటా కంపెనీని బహుళజాతి కంపెనీగా మార్చారు. సంస్థ విలువను నిలుపుకుంటూనే టాటా గ్రూప్‌ను ప్రపంచ బ్రాండ్‌గా మార్చారు. రతన్ టాటా దాతృత్వానికి పెట్టింది పేరు. టాటా గ్రూప్ సంపదలో అధిక భాగం టాటా ట్రస్ట్‌ల ద్వారా ధార్మిక కార్యక్రమాలకు కేటాయించేవారు. ఆయన ఎల్లప్పుడూ నైతిక వ్యాపార పద్ధతులను పాటిస్తూ.. సామాజిక బాధ్యత తీసుకోవాలని చెబుతుంటారు. రతన్ టాటా ఎప్పుడూ వినూత్నంగా ఆలోచించేవారు. ఆయన తీసుకున్న ఎన్నో సాహసోపేత నిర్ణయాలు సంస్థను ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడ్డాయి. ప్రపంచంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలలో రతన్ టాటా ఒకరు. అయితే ఆయన చెప్పుకో దగ్గ వ్యాపార దిగ్గజాలతో కలసి ఎక్కడా కనిపించే వారు కాదు. ఉప్పు నుంచి ఉక్కు వరకు టాటాలు ప్రవేశించని రంగమే లేదు. ఏ వ్యాపారమైనా నాణ్యతే, నమ్మకమే లక్ష్యంగా అంచెలంచెలుగా ఎదిగిన టాటా గ్రూప్ ప్రస్థానంలో రతన్ టాటా కృషి అసామన్యమైనది. ఆయన దగ్గరుండి వ్యవపారాన్ని నమ్మంతో ముందుకు నడిపించారు. టాటా ఉత్పత్తి అంటే నమ్మకం అన్న భావన కలిగించారు. అది భారతీయుల్లో విడదీయరాని బంధంగా మారింది. అత్యంత సాధారణ జీవితం గడుపుతూనే 6 ఖండాల్లోని వందదేశాల్లో టాటా గ్రూపునకు చెందిన 30 కంపెనీలకు ఆయన నేతృత్వం వహించారు. నిత్య మార్గదర్శ కుడిగా, దాతృత్వశీలిగా, మానవతావాదిగా నిలిచిన రతన్ టాటా.. ప్రపంచంలోనే దిగ్గజ వ్యాపారవేత్తల్లో ఒకరిగా ఎదిగారు. రతన్ టాటా ఎప్పుడూ లాభాల కంటే చిత్తశుద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆయన ఎంతో వినయంగా ఉంటారు. ప్రచారాలకు, ఆర్భాటాలకు దూరంగా.. సాధారణ జీవనశైలితో ఉండటానికి ఇష్ట పడతారు. రతన్ టాటాకు ఉన్న ఈ ప్రత్యేక లక్షణాలే ఆయనను కార్పొరేట్ టైటాన్‌గా నిలబెట్టాయి. కార్ల రంగంలో దిగ్గజ కంపెనీగా నిలబెట్టినా.. సామాన్యులకు కారును అందుబాటులోకి తీసుకుని రావాలని తపించారు. ఆయన తపనలోంచి వచ్చిందే నానో కారు. కేవలం లక్షకే నానో కారును మార్కెట్లో ప్రవేశ పెట్టారు. అలా రతన్ టాటా 2009లో సామాన్యుల కోసం రూ. లక్షకే నానో పేరుతో చీపెస్ట్ కారును మార్కెట్లోకి తీసుకొచ్చారు. ప్రజలపట్ల ఉన్న ప్రేమకు ఇది నిదర్శనంగా చూడాలి. ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన గొప్పతనం అంతాఇంతాకాదు. ఆయన మన నేలపై నడయాడిన ఓ రుషితుల్యుడు.

# నేను లీవ్ లో ఉంటా మీరు వసూలు చేయండి

## అన్నట్టుగానే ఉంది కార్యదర్శి పనితీరు

## వార్త రాసిన విలేకరిపై వివరణ ఇచ్చుకోకుండా బెదిరింపులా



మహాదేవపూర్ అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : మహాదేవపూర్ మండలం లోని మద్దులపల్లి గ్రామంలో పలుగుల సెవెన్ ఇసుక క్వారీ నిర్వహణ%శ్రీశీ% జరుగుతున్న ఓ ప్రముఖ విలేఖరి వసూళ్ల పర్వం గురించి వార్త ప్రచురించగా విలేఖరికే శోకాస్ నోటీస్ ఇవ్వడం సరైన పద్ధతి కాదని మీరు తప్పులు చేసి తప్పించుకునే విధంగా ఉంటే చూస్తూ ఊరుకోబోయే లేదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ ఖండించారు.

తన గ్రామంలో ఏం జరుగుతుందో తెలుసుకొలేని విధంగా కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారంటే వారి పనితీరు ఏంటో అర్థమవుతుంధని అయన అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో జరుగుతున్న వసూళ్లపై విచారణ చేసి గ్రామ కార్యదర్శి పై తగు చర్యలు తీసుకోవాలని అదే కాకుండా సర్పంచి పేరుతో వసూలు చేయడం ఏంటని సర్పంచుల పదవీకాలం గడిచిన గ్రామపంచాయతీ పేరు చెప్పడం గ్రామ కార్యదర్శినే ప్రోత్సహించే విధంగా ఉందని బెల్లంపల్లి సురేష్ అన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు దీనిపై విచారణ చేసి గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేయాల్సిందిగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ డిమాండ్ చేశారు.

# గాంధీ ఆవరణలో డేంజర్ గా ఇనుప చువ్వలు



సికింద్రాబాద్, అక్టోబర్ 10 (ప్రజామంటలు) : గాంధీ ఆసుపత్రి ఆవరణలో ఇటీవల చేపట్టిన నూతన డ్రైనేజీ నిర్మాణ పనుల్లో కనీస సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. గాంధీ మెయిన్ బిల్డింగ్ కు వెళ్ళే దారిలో డ్రైనేజీ పైప్ లైన్ పనుల్లో భాగంగా ఉన్న ఇనుప చువ్వల వద్ద ఎలాంటి బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డు లు పెట్టకపోవడంతో సందర్శకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది, ఆసుపత్రి పాలన యంత్రాంగం ఇప్పటికైన స్పందించి, సంబంధిత కాంట్రాక్టర్ కు తగిన సూచనలు చేయాలని కోరుతున్నారు.

# రతన్ టాటా మృతి 'దేశానికే తీరని లోటు

## భారత్ సురక్ష సమితి నాయకుల కొవ్వొత్తుల నివాళి



జగిత్యాల అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తాలో రతన్ టాటా మృతి పట్ల వారి చిత్ర పటానికి భారత్ సురక్ష సమితి నాయకులు పూలు వేసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించి. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈసందర్భంగా భారత్ సురక్ష సమితి నాయకులు ఏసిఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం మాట్లాడుతూ రతన్ టాటా మృతి దేశానికే తీరని లోటని అన్నారు. విలువలతో కూడిన వ్యాపారంతో పెద్ద బ్రాండ్‌ను సృష్టించారని, అలా సృష్టించిన సంపదను అన్ని వర్గాలకు చేరేలా టాటా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ సి ఎస్ రాజు, జిల్లా ప్రధానకార్యదర్శి అక్కినపెల్లి కాశీ నాథం, జిల్లా కార్యదర్శి సింగం గంగాధర్,వేముల పోచమళ్ళ, నరెందుల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, బండారి మల్లికార్జున్, లక్ష్మ రెడ్డి, మాడిషెట్టి మల్లేశం, సంపత్ రావు, గదసు భుమన్న, వొద్దేపెల్లి మురళి, రాజేశ్వర్ రావు, కొత్తకొండ బాలన్న తదితరులు పాల్గొన్నారు.

# శివ వీధి వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జగిత్యాల అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : జగిత్యాల పట్టణంలోని శివవీధి వైశ్య సంఘం మహిళలచే మహా బతుకమ్మ సంబరాలు గురువారం రాత్రి 7 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో మహా బతుకమ్మను పేర్చి ఏకరూప దుస్తులు ధరించి బతుకమ్మ పాటలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ సంబరాలు కొనసాగించారు. బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతం అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. అనంతరం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రధాన వీధుల గుండా వాహనంపై బతుకమ్మను శోభాయాత్రగా చింతకుంటకు నిమజ్జనానికి తరలించారు.

# చిలకలగూడ లో యువతి అదృశ్యం



సికింద్రాబాద్, అక్టోబర్ 10 ( ప్రజామంటలు ) : చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. ఎస్.ఐ వి.జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం...చిలకలగూడ రైల్వే క్వార్టర్ లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి ఎండి ఇంతియాజ్ ఒడిషా రాష్ట్రంలోని భువనేశ్వర్ సిటీలో నివాసం ఉంటున్న సోదరి కూతురు సబీనా బేగం (29)కు గత ఆరు నెలల క్రితం ఎంగేజ్ మెంట్ అయింది. అయితే తాను అమ్జద్ అలీ అనే యువకుడితో ప్రేమలో ఉన్నానని, తనకు పెండ్లి వద్దని యువతి తన తల్లికి చెప్పింది. ఈ క్రమంలో తన మేన కోడలు సబీనా బేగం ను మేనమామ ఇంతియాజ్ హైదరాబాద్ లోని చిలకలగూడ రైల్వే క్వార్టర్ లో తమ ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఇంతియాజ్ బయటకు వెళ్ళిన సమయంలో సబీనా బేగం ఇంటి వెనక డోర్ నుంచి వెళ్ళిపోయిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలో కనిపిస్తున్న యువతి ఆచూకీ తెలిసిన వారు తమకు తెలపాలని ఎస్.ఐ కోరారు.

# సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైన వొడితల ప్రణవ్

**- నియోజకవర్గ ప్రజలందరికీ బతుకమ్మ,విజయదశమి శుభాకాంక్షలు..**

**- వర్షంలోను బతుకమ్మ వేడుకలతో ఉత్సాహంగా గడిపిన మహిళలు..**





జమ్మికుంట అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : ప్రకృతికి, మానవాళి మనుగడకు ప్రతిరూపం బతుకమ్మ పండుగ అని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా వివిధ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను ఆసక్తిగా తిలకించారు. మహిళలకు బతుకమ్మ,విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతీ సంవత్సరం బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని,మన సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని పూలను దేవుళ్ళుగా కొలిచే సంస్కృతి ప్రపంచంలో ఎక్కడా లేదని ఇలాంటి సంస్కృతి తెలంగాణలోనే ఉందని అన్నారు. హుజురాబాద్,జమ్మికుంట పట్టణాల్లో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఆయన పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ వేడుకల్లో వరణుడు నేను సైతం అంటూ తన జల్లులతో మహిళల వేడుకలకు ఉత్సాహాన్ని కలిగించగా,అటు ప్రణవ్,ఇటు వరణుడి రాకతో బతుకమ్మ ప్రాంగణమంతా సంబరాలతో మారుమ్రోగింది.

# వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

## ముగిసిన బతుకమ్మ పండుగ సంబురాలు

(రామ కిష్టయ్య సంగన భట్ల)





ధర్మపురి అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : పట్టణంలో గురువారం సాయంత్రం నుండి రాత్రి వరకూ బతుకమ్మ పండగ ముగింపు వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనాదిగా ఆచరిస్తున్న వంశపారంపర్య పరంపరానుగత ఆచార నేపథ్యంలో, గురు వారం సాయంత్రం అత్యధిక సంఖ్యలో మహిళలు చద్దుల బతుకమ్మలను నదీ ప్రవాహంలో నిమజ్జనం గావించి ఘనంగా వీడ్కోలు పలుకడంతో ఈఏటి బతుకమ్మ సంబరాలు ముగి సాయి. తెలంగాణ గ్రామీణ సంస్కృతిని ప్రతిబిం



బించే బతుకమ్మ పండగ ముగింపు కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు సుదూర ప్రాంతాలలో ఉంటున్న స్థానిక ఆడ పడుచులంతా పిల్లా పాపలతో తరలి వచ్చారు. నదీ తీరానికి చేరుకున్న మహిళలు జట్టు జట్లుగా విడిపోయి బతుకమ్మలను వలయాకారాలలో పేర్చి సాంప్రదాయ పద్ధతులలో ఆటలాడుతూ, పాటలు పాడుతూ, పదంపాదం కలుపుతూ, చుట్టూ తిరుగుతూ అలౌకిక ఆనందం లో మునిగిపోయి తన్మయత్వంతో పరిసరాలను మరిచి పండగ జరుపు కున్నారు. తమవెంట తెచ్చుకున్న తిను బండారాలు పులిహొరాది ప్రత్యేక వంటకాలను ముందుగా బతుకమ్మలకు నివేదన మొనర్చి, సామూహికంగా ఆరగించారు. రాత్రి చాలాసేపు వరకూ కొనసాగిన సద్దుల బతుకమ్మ సంబరాల ముగింపుగా బతుకమ్మలను గోదావరి నదిలో వదిలి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. ధర్మపురి పోలీసులు ఎలాంటి అవాంఛనీయాలు జరుగకుండా విస్తృత బందోబస్తు చర్యలు చేపట్టారు. పురపాలక సంఘం పక్షాన అదనపు విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. బ్రాహ్మణ సంఘం భవనంలో మహిళలు సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని సంప్రదాయ జానపద గీతాలతో వలయాకారంగా తిరుగుతూ ఆటలాడారు. అల్పాహారం స్వీకరించారు.

ధర్మపురి 1981 ఎస్.ఎస్.సి కన్వీనర్ జక్కు రవీందర్ నేతృత్వంలో, మిత్రబృందం సహకారంతో గోదావరి తీరాన ఆహ్వాన వేదిక ఏర్పాటు చేశారు. ఆకర్షణీయ బతుకమ్మలకు 100 ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ వేదికాశీనులై బహుమతులను ప్రదానం చేశారు. బ్రాహ్మణ సంఘం భవనంలో, వైశ్య సత్రంలో రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు.

## రతన్ టాటా మృతి పట్ల ప్రణాళికా సంఘం

## వైస్ చైర్మన్ చిన్నారెడ్డి దిగ్భ్రాంతి

హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతి చెందడం పట్ల రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారత దేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందని, రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు అని చిన్నారెడ్డి పేర్కొన్నారు. గొప్ప మేధావి, మానవతావాది అయిన రతన్ టాటా కుటుంబ సభ్యులకు చిన్నారెడ్డి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు.

# గల్ఫ్ కార్మికుల పాలిట కరుణామయుడు సీఎం రేవంత్ రెడ్డి

## -గల్ఫ్ కార్మికుల రిక్రూటర్స్ కృతజ్ఞతలు



హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి జీవో జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ఓవర్సీస్ మ్యాన్ పవర్ రిక్రూట్మెంట్ ఏజెంట్స్ అసోసియేషన్ (ఓమ్రా) అధ్యక్షులు డిఎస్ రెడ్డి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. భారత ప్రభుత్వం, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా లైసెన్స్ పొంది విదేశీ ఉద్యోగాల భర్తీ వ్యాపారం చేస్తున్న రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెన్సీల సేవలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు. తెలంగాణ యువతకు గల్ఫ్ తదితర దేశాలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ నిరుద్యోగ నిర్మూలనలో తమవంతు బాధ్యత నిర్వహిస్తున్నామని డిఎస్ రెడ్డి అన్నారు.

గల్ఫ్ మృతులకు రూ.5 లక్షలు చెల్లించడం, గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకుల పాఠశాల లలో అడ్మిషన్లు, ప్రతి మంగళవారం, శుక్రవారం హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో 'ప్రవాసీ ప్రజావాణి' నిర్వహించడం దేశ చరిత్రలోనే ఒక మైలురాయి అని ఓమ్రా అధ్యక్షులు డిఎస్ రెడ్డి కొనియాడారు. తెలంగాణలో 150 రిజిస్టర్డ్ రిక్రూటింగ్ ఏజెన్సీలు ఉన్నాయని, త్వరలో నియమించే గల్ఫ్ సంక్షేమ సలహా కమిటీలో రిక్రూటర్స్ పక్షాన ఇద్దరికి అవకాశం ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# పూర్వ వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి..

## -పూర్వ వీఆర్వోల జిల్లా గౌరవ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్



జగిత్యాల అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : పూర్వ గ్రామ రెవెన్యూ అధికారులను(వీఆర్వో) యధావిధిగా రెవెన్యూ శాఖ లోకి తీసుకోవాలని ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం పూర్వ వీఆర్వోలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీనియారిటీ,విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకోకుండా అందరినీ రెవెన్యూ శాఖ లోకి తీసుకోవాలన్నారు. పూర్వ వీఆర్వోలను విధుల్లోకి తీసుకుంటూనే ..మిగితా ఖాళీలను అనుభవం కలిగిన వీ.ఆర్.ఏ.లతో భర్తీ చేయాలని,అలాగే జీ.ఓ.81 ప్రకారం మిగిలిపోయిన రాష్ట్రంలో 61 ఏళ్ల పైన ఉన్న వీ.ఆర్.ఏ.ల వారసులైన 3797 మందికి ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వంను ఆయన కోరారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

## ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

### ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి



బుగ్గారం అక్టోబర్ 10 (ప్రజా మంటలు) : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, అలాగే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి అన్నారు. బుగ్గారం మండలంలోని గోపులాపూర్ గ్రామంలో బతుకమ్మ , దసరా పండుగలను శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని గ్రామస్తులతో శాంతి సమావేశాన్ని బుగ్గారం ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులనుద్దేశించి ధర్మపురి సిఐ మాట్లాడుతూ దసరా , బతుకమ్మ పండుగల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. స్నేహపూర్వక వాతావరణంలో ప్రజలు కలిసి మెలిసి ఉండాలని సీఐ సూచించారు. ధర్మపురి సర్కిల్ పరిధిలోని ప్రజలకు సీఐ ముందుగా "దసరా" శుభాకాంక్షలు తెలిపారు. బుగ్గారం ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగిన ఉపేక్షించేది లేదన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏవైనా సమస్యలు0టే పోలీసు స్టేషన్ కు వచ్చి తనను నేరుగా కలువవచ్చని పేర్కొన్నారు. విజయదశమి పండుగను ప్రజలంతా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని శ్రీధర్ రెడ్డి సూచించారు.

# ఎమినెంట్ సైకాలజిస్ట్

## ఆఫ్ ద ఇయర్ 2024 ఎంపికైన జ్యోతి రాజా



సికింద్రాబాద్, అక్టోబర్ 10 ( ప్రజామంటలు ) : ప్రముఖ మనస్తత్వవేత్త జ్యోతి రాజా ఎమినెంట్ సైకాలజిస్ట్ ఆఫ్ ద ఇయర్ 2024 పురస్కారానికి ఎంపికయ్యారు. డెక్కన్ పాజిటివ్ మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ వారు జ్యోతి రాజా ని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. న్యూ బోయగూడ లో శ్రీ దీప్తి కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటుచేసి వందలాది మంది విద్యార్థులకు, యువతకు అనేక వ్యక్తిత్వ వికాస కార్య క్రమాలు నిర్వహించి, టీవీ ప్రసార మాధ్య మాల ద్వారా కౌన్సి లింగ్ ఇస్తూ వారికి సరైన దిశా నిర్దేశం చేస్తున్న జ్యోతి రాజా సేవలను గుర్తించామని తెలిపారు. ఈనెల 10వ తేదీ వరల్డ్ మెంటల్ హెల్త్ డే 2024 సందర్భంగా ఎంపిక చేసినట్లు, డీపీఎమ్ హెచ్ పీ ఆర్గనైజేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ సునంద రవి ప్రకటనలో తెలిపారు.

# డాక్టర్ లు పేషంట్లకు అందుబాటులో ఉండాలి..

## మందులు సిద్ధంగా ఉంచుకోవాలి - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జనగామ అక్టోబర్ 10 (ప్రజామంటలు) : జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ఓ.పి.రిజిస్టర్ ను పరిశీలిస్తూ ఓ.పి. పెంచాలన్నారు. వార్డు ను సందర్శించి అక్కడ వైద్యం పొందుతున్న 9మంది పేషంట్లతో మాట్లాడారు. వైద్యం అందుతున్నదా, భోజనం, టిఫిన్ సమయానికి అందిస్తున్నారా, అని ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ పరిశుభ్రత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతరం ఇదే విధంగా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ డి.ఎస్.వెంకన్న , డాక్టర్ లు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# బ్రాహ్మణ వీధిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

జగిత్యాల అక్టోబర్ 10 (ప్రజా మంటలు) జగిత్యాల పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గురువారం రాత్రి 7 గంటలకు బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలకు అనుగుణంగా చప్పట్లు కొడుతూ సంబరాలు కొనసాగించారు. అనంతరం గౌరమ్మకు వివిధ రకాల నివేదనలు సమర్పించి బతుకమ్మ పాటలు పాడుతూ ప్రధాన వీధుల గుండా మంగళ వాద్యాల నడుమ చింతకుంటకు శోభ యాత్రగా వెళ్లి బతుకమ్మలను నిమజ్జనం చేశారు.







# మహాగౌరీ రూపంలో అమ్మవారి దర్శనం

(రామ కిష్టయ్య సంగన భట్ల)





ధర్మపురి అక్టోబర్ 10 (ప్రజా మంటలు) :
శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీరామలింగేశ్వరాయలంలో ప్రతిష్ఠిత శారదామాత గురు వారం మహాగౌరీ దేవి రూపంలో దర్శనమిచ్చింది. దుర్గామాత అష్టమ శక్తి మహాగౌరీ నామంతో ప్రసిద్ధి. శరీరం గౌరవర్ణయుక్తయై, శంఖ, చంద్ర, కుంద పుష్పాలతో భాసిల్లే శరీరంతో, కుడిభు జంలో అభయముద్ర, కుడికింది చేతిలో త్రిశూలం, ఎడమ పై చేతిలో ఢమరుక, ఎడమ కింది చేతిలో వరద ముద్ర ధారిణియై, శాంత రూపిణియైన దేవి శుభముల ఫల దాయినిగా, అష్టమ దినంనాడు మహా గౌరీని దేవిగా ఆరాధిం చడం సంప్రదాయం. పార్వతి రూపంలో శివుని భర్తగా పొందాలని తపస్సు చేయగా, కఠోర తపస్సు ఫలితంగా ఆమె శరీరం నల్లబడగా, తపస్సుకు సంతు ష్టుడైన పరమ శివుడు గంగాజలంతో ఆమె శరీరాన్ని పరిశుద్ధం చేయగా, ఆమె దేహం విద్యుత్ ప్రభా సమంగా కాంతివంతంగా గౌర వర్ణంలో అలరారిన కారణంగా "మహా గౌరీ" నామాంకితయైనది. నవరాత్రులలో అష్టమి నాడు మహాగౌరీని ఉపాసించడం వల్ల సకల కల్మషాలు మటుమాయమై, పాప, సంతాప, దైన్య, దు:ఖాలు దరి చేరవని భక్తుల విశ్వాసం. ఈనేపథ్యంలో గౌరీ మాతృ ధ్యాన, స్మరణ, పూజ, ఆరాధన వల్ల సకల శుభాలు కలుగుతాయనే విశ్వాసంతో అమ్మవారిని అందుకు అనుగుణంగా అలంకరించి, పూజలు నిర్వ హించగా వేలాది మంది భక్తులు కైమోడ్పులిడి ప్రార్థించారు.దేవస్థాన కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, వేదపారాయణదారులు బొజ్జ రమేష్ శర్మ, సిహెచ్. ముత్యాల శర్మ, భరత్ శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, ఉపప్రధాన అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ద్యావళ్ళ విశ్వనాథ శర్మ, బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ సంపత్ కుమార్, బొజ్జ రాజగోపాల్ శర్మ, ఋత్వికులు నంబి అరుణ్ కుమార్, పాలెపు సందీప్ శర్మ, ద్యావళ్ళ సాయి శర్మ, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.సాయంత్రము 6.00 గం.లకు శ్రీ యోగ ఉగ్ర నరసింహ స్వామి వారల ఊరేగింపు సేవలు "హంసవాహనం"పై గ్రామములోని పురవీధులలో తిరిగి దేవాలయమనకు తెచ్చారు. సాయంత్రం 6.30 గంటల నుండి 7.30 గంటల వరకు శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి షోడషోపచార పూజతో హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుప బడినవి.

దుర్గ గాయత్రి శివాలయంలో సీతా రామశర్మ, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఒజ్జల ప్రసాద్ శర్మ ఆచార్యత్వంలో పూజలు జరిపారు. టిటిడి కళ్యాణ మండపంలో కాసర్ల వంశీకృష్ణ, జనమంచి వంశీకృష్ణ, బాల కృష్ణ పూజాదులు నిర్వహించారు.

## అన్నపూర్ణ దేవిగా అలంకరణ

**- కొనసాగుతున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు**



జగిత్యాల అక్టోబర్ 10 (ప్రజా మంటలు)
పట్టణంలోని నవదుర్గా పీఠ క్షేత్రంలో ఆవరణలోని శ్రీ దుర్గాదేవి శరన్నరాత్రోత్సవాలు అంగరంగవైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. ఉదయం నిత్య పూజ, మంత్రపుష్పం, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమం డాక్టర్ మంగాదేవి - వెంకటరత్నం చే నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పీఠ క్షేత్రంలో వేద బ్రాహ్మణుల మంత్రోత్సరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈబి కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, మహిళలు, భక్తులు, పాల్గొన్నారు.

## డిఇఒ కార్యాలయంలో రిపోర్ట్ చేసిన 2024లో ఎంపికైన డిఎస్సి అభ్యర్థులు



జనగామ అక్టోబర్ 10 (ప్రజామంటలు) :
జనగామ జిల్లాలో డిఎస్సి 2024లో ఎంపికై బుధవారం ఎల్.బి.స్టేడియంలో ఉత్తర్వులు అందుకున్న ఉపాధ్యాయ అభ్యర్థులు గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేశారని జిల్లా విద్యా శాఖ అధికారి కె.రాము తెలిపారు. 199 మంది అభ్యర్థులకు గాను 178 మంది రిపోర్ట్ చేశారు.ఇంకా 21 మంది శుక్రవారం రిపోర్ట్ చేయవలసిందిగా డిఇఒ తెలిపారు.



జనగామ పట్టణంలో జరిగే శ్రీదుర్గామాత ఉత్సవాలకు హాజరు కావాలని కమిటీ సభ్యులు జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కి అందిస్తున్న ఆహ్వానం.

## ఘనంగా శ్రీదుర్గ నవరాత్రి ఉత్సవాలు



జనగామ అక్టోబర్ 10 (ప్రజామంటలు):
జనగామ జిల్లా కేంద్రంలోని గుండ్లగడ్డ శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గా దేవి నవరాత్రి పూజా కార్యక్రమంలో జనగామ పట్టణ సీఐ దామోదర్ రెడ్డి పాల్గొన్నారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న సీఐ దామోదర్ రెడ్డి పేరున అయ్యగారు గంగు సాంబమూర్తి అర్చన చేసి, శాలువాతో సన్మానం చేశారు. అనంతరం అమ్మవారి వద్ద పూజలు అందుకున్న పెన్నులు, పుస్తకాలని పిల్లలకు సీఐ దామోదర్ రెడ్డి చేతుల మీద అందజేశారు. పిల్లలను ఉద్దేశించి సీఐ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలంతా చక్కగా చదివి ప్రయోజకులై దేశానికి, కన్న తల్లిదండ్రులకి పేరు తీసుకురావాలని కోరారు. ఏదైనా ఘర్షణ వాతావరణం సంభవించిన, అపాయ సమయంలో 100కు ఫోన్ చేయాలని భక్తులకు తెలియజేశారు. సిఐ దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులకు తీర్థ, ప్రసాదము భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో రామిని శ్రీనివాస్, ప్రకాష్, కాచం నరసింగారావు, విజయ్,రాజు,చుంచు శ్రీకాంత్, పవణ్,నీల, జ్యోతి, రాణి, రమ పాల్గొన్నారు.

# రతన్ టాటా మృతికి రాజేశాం గౌడ్ సంతాపం



హైదరాబాద్ అక్టోబర్ 10 (ప్రజా మంటలు) :
విలువలతో కూడిన వ్యాపారం చేస్తూ, వ్యాపారం అంటే కేవలం ఆదాయం మాత్రమే కాదని అభిమానం, ఆత్మీయత అని నిరూపిస్తూ, భారతీయుల గుండెల్లో చెరగని ముద్ర వేసిన గొప్ప వ్యాపారవేత్త . నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనమైన రతన్ టాటా మృతి భారత దేశానికి తీరని లోటని మాజీ మంత్రి, మొదటి ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశం గౌడ్ నిళులర్పించారు.దేశం సంకట స్థితిలో ఉన్నప్పుడు అన్నీ మరచి అపన హస్తాన్ని అందించి అంచలంచల దేశభక్తుడు. పేదల మధ్యతరగతి వాళ్ళ కష్టాలను దూరం చేయడమే వ్యాపారమని, ఆదాయం కంటే ఆత్మసంతృప్తి గొప్పదని నమ్మే మంచి మనసుతో కోట్లాది భారతీయుల హృదయాలను దోచుకొని గొప్ప లాభాన్ని సంపాదించి ఆ భగవంతుడే ఆశ్చర్యపోయే ప్రేమాభిమానాల మూటలు వెంటబెట్టుకొని వెళ్లిన సిసలైన భారతరత్నం రతన్ టాటా కు కన్నీటి వీడ్కోలు పలుకుతూ, రతన్ జి మీ నుండి నిరాడంబరత, విలువలతో కూడిన వ్యాపార సూత్రాలు స్ఫూర్తి పొంది ఆచరిస్తున్నామని ఆయన అన్నారు.

## గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైన కేడం లింగమూర్తికి కాంగ్రెస్ పార్టీ నాయకుల సన్మానం



చిగురుమామిడి అక్టోబర్ 10 (ప్రజా మంటలు) :
సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల కేడియం లింగమూర్తి ను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి వారికి ఆర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీలో గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం పార్టీ జెండాను భుజం పైన నెత్తుకుని, పార్టీ అధికారం లో లేకపోయినా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు ఎలాంటి కష్టం వాటిల్లిన వారికి చేదోడు వాదోడుగా ధైర్యంగా వారి పక్కన నిలబడి నేనున్నా అనే ధైర్యం చెప్పే వ్యక్తిత్వం ఆయనదని కొనియాడారు. వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే నాయకుడిగా ఉంటూ, వారి సేవలను పార్టీ గుర్తించి గతంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా బాధ్యతలు ఇచ్చింది.. 20 సంవత్సరాలు హుస్నాబాద్ మండల అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు,అలాగే హుస్నాబాద్ గ్రామం గా ఉన్నపుడు ఒక దఫా సర్పంచిగా బాధ్యతలు నిర్వహించారు వారి 30 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో మాలాంటి యువకులకు వారే మాకు మార్గదర్శకం.. వారి కష్టపడే తత్వం ఎంతో ఆదర్శంగా నిలిచింది.. ప్రస్తుతం వారు పిసిసి కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు...అలాగే వారు ఇలాగే ముందు ముందు ఇంకా కూడా ఉన్నతమైన పదవి బాధ్యతలు చేపట్టాలని ఆకాంక్షిస్తూ మరొక్కసారి వారికి హర్థిక శుభాకాంక్షలు.. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా వారి నియామకానికి సహకరించిన హుస్నాబాద్ కా బాద్షా గౌరవనీయులు పెద్దలు ఈ ప్రాంతం ముద్దుబిడ్డ రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు చిగురుమామిడి ప్రజల నుండి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే%o%ఆరు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయిని వంశీకృష్ణ, కొయ్యడ కార్తీక్, బోయిని విజయ్ కుమార్ తదతరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ చట్టం తెచ్చేవరకు గ్రూప్ పరీక్షలన్నీ వాయిదా వేయాలి

**సీఎం రేవంత్ రెడ్డి మాదిగలను మభ్య పెడుతున్నారు**
**ఇక రేవంత్ ను మాదిగలు నమ్మే స్థితిలో లేరు**
**మీడియా సమావేశంలో మందకృష్ణ మాదిగ**



సికింద్రాబాద్,అక్టోబర్ 10 (ప్రజామంటలు) :
త్వరలో జరగబోయే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలతో పాటు గ్రూప్-4 ఫలితాలను నిలుపుదల చేయాలని, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయి, అమలులోకి వచ్చాకా గ్రూప్ పరీక్షలను నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అద్యక్షులు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్శీగుట్ట లోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
ఇన్నాళ్ళు సీఎం రేవంత్ ను నమ్మి మాదిగ జాతి మోసపోయిందని, ఇకనుంచి నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఉద్యోగ నియమాకాలు చేపడతామని, అంతకు ముందు నోటిఫికేషన్లు ఇచ్చిన ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని, అవసరమైతే ఆర్డినెన్స్ తెస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం చెప్పిన మాటలకు విలువ లేకుండా పోయిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం చేయకముందే బుధవారం ఉపాధ్యాయ పోస్టుల నియమకాలను పూర్తి చేశారని ఆయన మండిపడ్డారు. దీనివలన మాదిగలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు.
ఇకపై ఇలాంటి నష్టాలు మాదిగ జాతికి కలగవద్దనే తాము రెండు నెలల పాటు అన్ని నియమకాలను నిలిపి, ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని కోరుతున్నామన్నారు. ఆగస్ట్ 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు వస్తే, సెప్టెంబర్ నెలలో వైద్య ఆరోగ్య శాఖ లో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్టెక్నిషియన్ల పోస్టుల భర్తీకి మంత్రి దామోదర రాజ నర్సింహా నోటిఫికెషన్లను ఇచ్చారన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టం రాకముందే ఒక మాదిగ జాతికి చెందిన మంత్రితో సుప్రీం కోర్టు తీర్పును గౌరవించకుండా మాదిగలకే నష్టం కలిగించిన ఘనత సీఎం రేవంత్ కు దక్కుతుందన్నారు. వేరే ఏ ఇతర శాఖ లో వైద్య శాఖలో జరిగినన్నీ నియమకాలు జరగలేదన్నారు. మాల అయినటువంటి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మాదిగలపై ఈ కుట్ర జరిగిందని విమర్శించారు. బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శాంతియుతంగా నల్లజెండాల ప్రదర్శన నిర్వహిస్తే, ప్రభుత్వం పోలీస్ బలగాలతో అడ్డుకొని అణచివేసే కుట్ర చేయడం అప్రజాస్వామికమన్నారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను రేవంత్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కాల రాస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యే వరకు తాము ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా క్షేత్రం నుంచి పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. ఈనెల 16న ఎమ్మార్పీఎస్ అనుబంధసంస్థల జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండలాల కమిటీలతో వరంగల్ లో సమావేశం నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అద్యక్షులు గోవింద్ నరేష్, జిల్లా అద్యక్షులు నరసింహారావు, దప్పు మల్లికార్జున్, ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి పట్టణ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సు ఢీకొని హెూంగార్డు సుబ్బరాజు మృతి**



మెట్ పల్లి అక్టోబర్ 10(ప్రజా మంటలు)
నిజామాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు టిఫిన్ కోసం వెళ్తూన్న హం గార్డ్ సుబ్బరాజును ఢీకొనడంతో, ఆయన తీవ్రంగా గాయపడి మరణించాడు.

# మండలంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

## ఇందుర్తిలో పోటా పోటీగా భారీ బతుకమ్మలు



చిగురుమామిడి అక్టోబర్ 10 (ప్రజా మంటలు) :
చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను గ్రామాల కూడళ్లలో వుంచి బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలు ఆడారు.గ్రామాల లో బతుకమ్మ సంబరాల సందర్భంగా అనేక రకాల పూలను సమకూర్చుకొని మహిళలు బతుకమ్మలను పేర్చి గ్రామాలలోని కుంటలు చెరువుల్లో వాగులలో నిమజ్జనం చేశారు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభం అయిన బతుకమ్మ వేడుకలుతొమ్మిది రోజులపాటు కొనసాగి సద్దుల బతుకమ్మ తో ముగిశాయి.బతుకమ్మలు నిమజ్జనం చేయుటకు గ్రామాలలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు,ప్రత్యేక అధికారులు , లైటింగ్ తో ఏర్పాట్లు చేశారు.బతుకమ్మ ల నిమజ్జనం లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

బతుకమ్మ ఘాట్ లలో విద్యుత్ లైట్లలతో అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు మహిళలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు మండలంలోని పెద్ద పెద్ద బతుకమ్మల ను పేర్చడములో యువసేన యూత్ అధ్యక్షులు గాదే రఘునాథ్ రెడ్డి గౌరవ అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి పోటీపడ్డారు ఇందుర్తి గునుకుల పల్లె గ్రామాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించరు.



గొల్లపల్లిలో మండల కేంద్రంలో శ్రీ భక్తాంజనేయ దేవస్థానం లో, విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

## గాంధీలో వరల్డ్ మెంటల్ హెల్త్ డే



సికింద్రాబాద్, అక్టోబర్ 10 (ప్రజామంటలు) :
వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా గురువారం గాంధీ ఆసుపత్రి, గాంధీ మెడికల్ కాలేజీ ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానసిక అనారోగ్యంతో బాధపడేవారు గాంధీ ఆసుపత్రి సైకియాట్రిక్ వైద్యులను సంప్రదించాలని సైకియాట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కే.అనుపమ సూచించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు తగు పద్దతులను ఆమె వివరించారు. కార్యక్రమంలో పీజీ వైద్యులు, ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మికుంట లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**-ఆటపాటలతో ఆడబిడ్డల సంబరాలు.**
**- తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలు.**
**- ఘనంగా ఏర్పాట్లు చేసిన జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం.**



జమ్మికుంట (ప్రజా మంటలు) :
ప్రపంచంలోనే పూలను పూజించే పండగ బతుకమ్మ పండుగ,ఇటువంటి పండగను మన తెలంగాణ రాష్ట్రంలో ఘనంగా జరుపుకోవడం ఆనవాతిగా వస్తుంది.బొడ్డమ్మ నుండి మొదలైనటువంటి బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజులు తొమ్మిది రకాల బతుకమ్మలను ఏర్పాటు చేసి వాడవాడనా ఆడుకుని చివరి రోజు సద్దుల బతుకమ్మ ఘనంగా తయారుచేసుకొని ఊరి ప్రజలంతా ఒక సమూహం దగ్గరగా ఏర్పడి కొత్త బట్టలతో పూలను పూజించే పండగను చేసుకోవడం మహిళలంతా సంబరాలతోఅంబరాన్ని అంటే విధంగా జరుపుకున్నారు.బతుకమ్మ ఆడుకోవడానికి జమ్మికుంట మున్సిపల్ పాలకవర్గం ఘనమైన ఏర్పాట్లు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవడం హర్షనీయం. ప్రపంచంలోనే అరుదైన పండుగ బతుకమ్మ పండుగ మన తెలంగాణ రాష్ట్రంలో జరుపుకోవడం మనందరి అదృష్టంగా భావించడం జరుగుతుంది. ఘనమైన ఏర్పాట్ల మధ్య బతకమ్మ పండగను నిర్వహించుకోవడం జరిగింది.

## జయదుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం




జగిత్యాల అక్టోబర్ 10 (ప్రజా మంటలు) :
జయ దుర్గ సేవ సమితి ఆధ్వర్యంలో దుర్గాష్టమి రోజున దుర్గ దేవి అలంకరణలో ఎనిమిదో వ రోజు గురువారం అమ్మవారు దర్శనం ఇచ్చారు. సప్తశతి పారాయణము మంత్ర పుష్పంము నవగ్రహ కలశాలకు మాతాలచే కుంకుమ పూజ నిర్వహించబడినది. అధిక సంఖ్యలో భక్తులు భవాని దిక్షపరులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదంగా అన్నదానము పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో జయ దుర్గ సేవ సమితి సభ్యులు భవాని దీక్షపరులు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా ఐసిఐసిఐ బ్యాంక్ కుంభకోణంపై విచారణ

## బాధితులకు అండగా ఉంటామన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

పల్నాడు,అక్టోబర్10(ప్రజా మంటలు):





పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట ఐసీఐసీఐ బ్యాంకు శాఖల్లో జరిగిన అక్రమాలపై సీఐడీ విచారణ చేపట్టింది. ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్న బాధితులను మోసం చేసిన వ్యవహారంలో చిలకలూరిపేట బ్యాంకు సిబ్బందిని అధికారులు విచారిస్తున్నారు. ఖాతాదారుల ఎఫ్డీలు దారి మళ్లించడంలో ఉన్న పాత్ర, ఎంత మొత్తంలో నగదు దారి మళ్లించారనే విషయంపై ఆరా తీస్తున్నారు. మోసపోయిన ఖాతాదారులకు చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అండగా నిలిచారు. బాధితులకు న్యాయం చేయాలని బ్యాంకు అధికారులను ఆయన కోరారు. బాధితులు రెండు నెలలుగా ఫిక్స్డ్ డిపాజిట్ల వడ్డీ ఖాతాకు జమ కాకపోవడంతో ఇటీవల బ్యాంకుకు వెళ్లి నిలదీశారు. ఆ ఫిక్స్డ్ డిపాజిట్ల బాండ్లు చెల్లవని.. అందులో నగదు, బంగారం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో హతాశులయ్యారు. మో ి పోయామని గుర్తించి, పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఈ కేసును సీఐడీకి అప్పగించారు.

# సీఎంఆర్ఎఫ్ కు రూ.3.50 లక్షల విరాళం

## సీఎం చంద్రబాబుకు అందజేసిన మంత్రి సవిత

అమరావతి,అక్టోబర్10 (ప్రజా మంటలు):



విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం నిమిత్తం పెనుకొండ నియోజక వర్గ దాతలు అందజేసిన రూ.3.50 లక్షలను సీఎంఆర్ఎఫ్ కు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత అందజేశారు. ఈ మేరకు గురువారం మంత్రిమండలి సమావేశం అనంతరం సీఎం చంద్రబాబునాయుడుకు మంత్రి చెక్ లను అందజేశారు. పెనుకొండ పట్టణానికి చెందిన ప్రగతి, రేవతి, బాబా ఫక్రుద్దీన్, దాదా పీర్, బాబా మహిళా గ్రామ సమాఖ్యల్లోని సభ్యులు అందజేసిన రూ.1.50 లక్షలు, బూదిలి గ్రామానికి చెందిన భ్రమరాంభిక మహిళా సంఘ సభ్యులు ఇచ్చిన రూ.50 వేలు, ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ రూ.లక్ష, పరిగి మండలకేంద్రానికి చెందిన ఇటుక బట్టీ యజమానులు రూ.50 వేలు... ఇలా మొత్తం రూ.3.50 లక్షలను సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ...విజయవాడ వరద బాధితులను ఆదుకోడానికి ముందుకొచ్చిన పెనుకొండ నియోజక వర్గానికి చెందిన దాతలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరికొందరు దాతలు బాధితులను ఆదుకోడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

### రతన్ టాటాకు ఎపి పరిశ్రమలశాఖ నివాళి

అమరావతి,అక్టోబర్10 (ప్రజా మంటలు):

దిగ్గజ పారిశ్రామిక వేత్త, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటాకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, అధికారులు, సిబ్బంది నివాళులు అర్పించారు.గురువారం మంగళగిరి పరిశ్రమల శాఖ కమిషనర్ కార్యాలయంలో రతన్ టాటా చిత్రపటానికి నివాళులు అర్పించిన డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రతన్ టాటా వారితో తాను కలిసిన సందర్భాలను గుర్తు చేసుకున్నారు.రతన్ టాటా ఎంతో గొప్ప వ్యక్తని, గ్లోబల్ పేస్ అఫ్ ఇండియాను మార్చిన మహోన్నతుడని, అంతేగాక జీవితం చివరి వరకు విలువలు పాటించిన వ్యక్తిగా ఎంతో సాధారణ జీవితం గడిపారని చెప్పారు. భారతదేశంలో పారిశ్రామిక రంగ ఎదుగుదలకు ఆయన చేసిన కృషిని ప్రశంసించారు. ప్రఖ్యాత టాటా మెమోరియల్ హాస్పిటల్ మరియు అనేక ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్సీ ని స్థాపించి వివిధ కార్యక్రమాల రూపంలో సమాజ సేవకు ఆయన చేసిన సేవలను పొగిడారు.తన జీవితమంతా టాటా పరిశ్రమకు మరియు భారతదేశంలోని అనేక మంది జీవితాల సంక్షేమం కోసం అంకితం చేశారు అని కొనియాడారు. ఆయన మరణం భారతదేశానికి తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

# చిరు వ్యాపారులకు అండ

## తోపుడు బండ్లు అందచేసిన ఎంపి చిన్ని

విజయవాడ,అక్టోబర్10 (ప్రజా మంటలు):

చిరు వ్యాపారస్తులకి ఎంపి కేశినేని శివనాథ్తోపుడు బండ్లు అందజేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో చిరు వ్యాపారం చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్న ఇద్దరు చిరు వ్యాపారులకి గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తోపుడు బండ్ల అందజేశారు. 54వ డివిజన్ వించిపేట లో నివసించే ఎమ్.తిరుపతమ్మ, 51వ డివిజన్ శ్రీనివాసమహల్ సెంటర్ కి చెందిన మావూరి వెంకట్రావు లకు కూరగాయల వ్యాపారం చేసుకునేందుకు ఈ తోపుడు బండ్లను ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సొలంకి రాజు సహకారంతో ఎంపి కేశినేని శివనాథ్ లబ్దిదారులకి అందించారు. . ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు..పేద వారికి సాయం చేయటంలో టిడిపి ముందుంటుందన్నారు . తోపుడు బండ్లు అందుకున్న ఆ ఇద్దరు ఎంపి కేశినేని శివనాథ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొగంటి రామారావు, గన్నే నారాయణ ప్రసాద్ (అన్న) , మాజీ కార్పొరేటర్ ఎరుబోతు రమణ, యేర్నెని వేదవ్యాస్, మాదిగాని గురునాథం,పొన్నం రవి, ఆళ్ల మోహన్ రావు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# 72 మందికి చెందిన రూ.28 కోట్లు మాయం

## ఐసిఐసిఐ బ్యాంకు గోల్మాల్పై సీఐడీ అదనపు ఎస్పీ

నరసరావుపేట,అక్టోబర్10 (ప్రజా మంటలు):

పల్నాడు జిల్లా చిలకలూరిపేట, నరసరావుపేట ఐసీఐసీఐ శాఖల్లో అక్రమాలు జరిగినట్లు ఏపీ సీఐడీ నిర్ధరించింది. చిలకలూరిపేట శాఖలో ఖాతాదారుల డబ్బు మళ్లించినట్లు సీఐడీ అదనపు ఎస్పీ వెల్లడించారు. 72 మందికి చెందిన రూ.28 కోట్లు మాయం చేశారన్నారు. విజయవాడ జోనల్ అధికారి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులను విచారిస్తున్నామని, బ్యాంకు శాఖలోనూ విచారణ చేస్తామన్నారు. మోసపోయిన ఖాతాదారులకు చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అండగా నిలిచారు. బాధితులకు న్యాయం చేయాలని బ్యాంకు అధికారులను ఆయన కోరారు. బాధితులు రెండు నెలలుగా ఫిక్స్డ్ డిపాజిట్ల వడ్డీ తమ ఖాతాకు జమ కాకపోవడంతో ఇటీవల బ్యాంకుకు వెళ్లి నిలదీసిన సంగతి తెలిసిందే. ఆ ఫిక్స్డ్ డిపాజిట్ల బాండ్లు చెల్లవని.. అందులో నగదు, బంగారం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో హతాశులయ్యారు. మోసపోయామని గుర్తించి, పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు ఈ కేసును సీఐడీకి అప్పగించారు.

# రతన్ టాటాకు చంద్రబాబు నివాళి

## ఎపి కేబినేట్ ఘనంగా నివాళి





ముంబై/అమరావతి,అక్టోబర్10(ప్రజా మంటలు):

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాకు ఎపి సిఎం చంద్రబాబు నివాళి అర్పించారు. దిగ్గజ పారిశ్రామికవేత్త, పద్మవిభూషన్ గ్రహీత, టాటా సన్స్ సంస్థ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా భౌతికకాయానికి ఏపీముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. ముంబయిలోని ఎన్సీపీఏ గ్రౌండ్లోని పార్థివదేహం ఎదుట పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్తోపాటు, గ్రూప్ ఉన్నతాధికారులు, టాటా కుటుంబ సభ్యులతో చంద్రబాబు మాట్లాడారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రతన్ టాటా లాంటి మహోన్నతమైన వ్యక్తి ఈ లోకాన్ని వీడిపోవడం తీరని లోటన్నారు. ప్రత్యేక విమానంలో ముంబై వచ్చిన బాబు నేరుగా టాటా భౌతిక కాయం సందర్శించి నివాళి అర్పించారు. అంతకు ముందు సచివాలయలంఓ సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ భేటీ ముగిసింది. అజెండా అంశాలపై చర్చను క్యాబినెట్ వాయిదా వేసింది. రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించింది. భేటీకి ముందు ఆయన చిత్రపటం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రులు నివాళి అర్పించారు. అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ముంబయికి బయలుదేరారు. రతన్ టాటా పార్థివ దేహానికి వారు నివాళులర్పించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కొందరు మాత్రమే తమ అడుగుజాడలు వెళుతూ వెళుతూ ఈ భూమిపై వదిలి వెళతారని, తమ దూరదృష్టి, సమగ్రతలతో రతన్ టాటా అదే చేశారని అన్నారు. మనం కేవలం ఒక గొప్ప వ్యాపారవేత్తనే కాదు గొప్ప మానవతావాదిని కోల్పోయామని, కేవలం పారిశ్రామిక వారసత్వంలోనే కాకుండా ఆయన అందరి హృదయాలను స్పృశించి వెళ్ళారన్నారు. ఆయన పారిశ్రామిక రంగానికి చేసిన సేవ, జాతి నిర్మాణం లోనూ, పరోపకారి గుణంలోనూ తరతారాలలో మార్పును తెచ్చిందని కొనియాడారు. ఆయన గొప్ప వారసత్వాన్ని మనకు వదిలి వెళ్ళారని, టాటా గ్రూప్కు, ఆయనను ప్రేమించేవారికి బాధా తప్త హృదయంతో సంతాపం తెలియజేస్తున్నానని సీఎం చంద్రబాబు నాయుడు సామాజిక మాద్యమం ఎక్స్ వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అని మంత్రి లోకేష్ అన్నారు. దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూప్ సంస్థలను దశాబ్దాలుగా అదే నిబద్ధతతో నిర్వహించిన పద్మవిభూషణ్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయమని అన్నారు. టాటా గ్రూప్ ఉత్పాదనలు వాడని భారతీయులు ఉండరని, మన దేశంలో ఏ మూల ఏ విపత్తు సంభవించినా భారీ విరాళంతో స్పందించే మానవత్వపు హృదయం రతన్ టాటాదని, నిజాయితీని, నిస్వార్థపరత్వాన్ని టాటా బ్రాండ్గా చేసిన రతన్ టాటాకు మరణం లేదని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించే ఉంటారని అన్నారు. నమ్మకమైన టాటా ఉత్పత్తుల రూపంలో ప్రతి ఇంట్లోనూ మనందరినీ ప్రతిరోజూ చిరునవ్వుతో పలకరిస్తూనే ఉంటారని.. రతన్ టాటా నిరుపమానమైన సేవలను స్మరిస్తూ, అశ్రు నివాళులు అర్పిస్తున్నానని మంత్రి లోకేష్ అన్నారు.ముంబయిలోని ఎన్సీపీఏ గ్రౌండ్లో రతన్ టాటా పార్థివ దేహాన్ని ప్రజలు, ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభం కానుంది. మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో సాయంత్రం రతన్ టాటా అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# ఆప్,బిజెపిల మధ్య మాటల యుద్ధం

## బంగళాల కోసం రాజకీయాలు చేయమన్న అతిశి

న్యూఢిల్లీ,అక్టోబర్10 (ప్రజా మంటలు):

దేశ రాజధాని నగరం దిల్లీలో ఆప్, భాజపా మధ్య మరోసారి మాటల యుద్ధం కొనసాగుతోంది. ఫ్లాగ్స్టాఫ్ రోడ్లో దిల్లీ సీఎం అధికారిక నివాసం నుంచి ఆతిశీని బలవంతంగా ఖాళీ చేయించారంటూ ఆప్ చేస్తోన్న ఆరోపణలతో అక్కడి రాజకీయం మరోసారి వేడెక్కింది. తాజాగా సీఎం ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ.. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ను ఓడించలేమన్న నిరాశతోనే భాజపా ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో భాజపాకు రెండంకెల సీట్లు కూడా రావన్నారు. ఆప్ను చీల్చేందుకు గతంలో చేపట్టిన 'ఆపరేషన్ కమలం' విఫలమైందన్న ఆతిశీ.. ఆప్ నేతలను జైళ్లకు పంపినా భాజపాకు ఫలితం దక్కలేదన్నారు. తమ పార్టీ బంగ్లాలు, కార్ల కోసం రాజకీయాలు చేయదని చెప్పారు. అవసరమైతే.. ఆప్ మంత్రులు, ఎమ్మెల్యేలు వీధుల్లోంచి పనిచేసేందుకు సైతం సిద్ధంగానే ఉన్నారన్నారు. ఆతిశీ తన వస్తువులతో నిండిన డబ్బాలు ఉన్నచోట ఫైల్స్పై సంతకాలు చేస్తున్న ఫొటోలను ఆప్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంపై భాజపా తప్పుపట్టింది. ఆప్ డ్రామాలు ఆడుతోందని.. ప్రజల్లో సానుభూతి కార్డు ప్లే చేస్తోందని మండిపడుతోంది. ఆప్ నేతలు చెబుతున్నట్లుగా ఎ÷-లాగ్స్టాఫ్ రోడ్డులోని బంగ్లా దిల్లీ సీఎం అధికారిక నివాసం కాదని భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్దేవ అన్నారు. ఆతిశీకి మథుర రోడ్డులో ఇప్పటికే బంగ్లా ఉందని.. ఆప్ నేతలు చెబుతున్నవి కేవలం ఆరోపణలేనన్నారు. సీఎం దిల్లీ సచివాలయంలో తన పూర్తిస్థాయి కార్యాలయం నుంచే పని చేయాల్సి ఉన్నా.. ఇలా ఖాళీ పె÷-టటెలు ఉన్నచోట్గ ÷ళ్లైపై సంతకాలు చేస్తున్నట్లుగా ఉన్న ఫొటోలను షేర్ చేయడం ద్వారా ఆప్ నేతలు సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారని భాజపా నేతలు పేర్కొన్నారు.

# ఢిల్లీలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టివేత

## దాదాపు రూ.2000 కోట్లు ఉంటుందని అంచనా

న్యూఢిల్లీ,అక్టోబర్10(ప్రజా మంటలు):

దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. రమేష్ నగర్లో 200 కిలోల కొకైన్ను స్పెషల్ సెల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన కొకైన్ విలువ దాదాపు రూ.2000 కోట్లు ఉంటుందని వెల్లడించారు. జీపీఎస్ ద్వారా డ్రగ్స్ స్మగ్లర్స్ను కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు.. పక్కా ఎ÷-లాన్ ప్రకారం ఇవాళ పశ్చిమ ఢిల్లీలోని రమేష్ నగర్లో సోదాలు చేసి పెద్ద ఎత్తున డంప్ చేసిన కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. తమ రాకను ముందే పసిగట్టిన నిందితులు లండన్?కు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఇదే వారంలో ఢిల్లీలో రూ.5,600 కోట్ల విలువైన 500 కేజీల కొకైన్ పట్టుబడిన విషయం తెలిసిందే. దీంతో వారం వ్యవధిలోనే దేశ రాజధానిలో రూ.7,000 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. ఇవాళ పట్టుబడిన కొకైన్?కు ఇంతకు ముందు దొరికిన డ్రగ్స్?కు లింక్ ఉందని అధికారులు వెల్లడించారు. వారం వ్యవధిలోనే రూ.7,500 కోట్ల విలువైన 762 కిలోల డ్రగ్స్ను సీజ్ చేశామని.. దేశంలోనే అతిపెద్ద డ్రగ్స్ రవాణా ఇదేనని అధికారులు తెలిపారు. ఈ భారీ కొకైన్ రవాణా వెనుక అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ సిండికేట్ హస్తం ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రత్యేక డ్రగ్ సిండికేట్ -భారత్?లోని ఢిల్లీ, ముంబైలలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని.. వీరికి- దుబాయ్తో కూడా లింకులు ఉన్నాయని పేర్కొన్నారు.



# బోర్డు తిప్పేసిన సాఫ్ట్వేర్ కంపెనీ


హైదరాబాద్ (ప్రజా మంటలు):

మాదాపూర్లో ఉద్యోగాలు ఇస్తామని డబ్బులు వసూలు చేసి ఓ సాఫ్ట్వేర్ కంపెనీ బోర్డు తిప్పేసింది. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ఆ సంస్థ పేరు సినార్జీ యూనివర్సల్ కంపెనీ. మాదాపూర్ కావూరి హిల్స్?లోని వివి చాంబర్స్ నాలుగో అంతస్తులో సినార్జీ యూనివర్సల్ కంపెనీ ఆఫీస్ ఉంది. ఉద్యోగాలు ఇస్తామని ఒక్కొక్కరి వద్ద నుంచి 3 లక్షల రూపాయలు వరకూ కంపెనీ యాజమాన్యం వసూలు చేసింది. ఆఫర్ లెటర్ చేతికిచ్చి వర్క్ ఫ్రం హోమ్ అని చెప్పి ఆరు నెలలు గడిపిన కంపెనీ యాజమాన్యం చివరకు ఇలా హ్యాండిచ్చింది. ఇలా సుమారు 500 మంది వద్ద నుంచి సినార్జీ యూనివర్సల్ కంపెనీ డబ్బులు వసూలు చేసింది. గత ఆరు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో కంపెనీ యాజమాన్యాన్ని ఉద్యోగులు ప్రశ్నించారు. కంపెనీకి ప్రాజెక్టులు లేవని ఉద్యోగులతో కంపెనీ యాజమాన్యం తెలిపింది. గత కొద్ది రోజుల నుంచి కంపెనీ యాజమాన్యం ఆఫీస్?కి రాకపోవడంతో మోసపోయామని ఉద్యోగులు ఆలస్యంగా గ్రహించారు. మోసపోయామని తెలుసుకొని మాదాపూర్ పోలీస్ స్టేషన్?లో ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. కంపెనీ చేసిన మోసం కోట్లలో ఉండడంతో ఇక్షచిలో (ఆర్థిక నేర విభాగం) ఫిర్యాదు చేయాలని మాదాపూర్ పోలీసులు బాధితులకు తెలిపారు.దేవాలయాల ప్రతిపత్తి కాపాడడం సరైనదే

# ప్రభుత్వం తీరును అభినందించిన రమణదీక్షితులు

తిరుమల,అక్టోబర్10 (ప్రజా మంటలు):

రాష్ట్రంలోని దేవాలయాల పరిరక్షణకు ఏపీ ప్రభుత్వం జీవో నెం. 223 ఉత్తర్వులను జారీ చేయడం అభినందనీయమని శ్రీవారి ఆలయ మాజీ ప్రధానార్చకులు రమణ దీక్షితులు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్న వేళ ఈ శుభపరిణామం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్లకు అర్చకుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ నూతన జీవో ప్రకారం రాష్ట్రంలోని దేవాలయాల్లో పురాతనం నుంచి కొనసాగుతున్న ఆగమ కార్యకలాపాల్లో అధికారుల జోక్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఆలయాల్లో నిర్వహించే అభిషేకాలు, ఉత్సవాలు, కుంభాభిషేకాలు మొదలైన వాటిలో సీనియర్ అర్చకులు, అగమశాస్త్ర పండితులతో సంప్రదింపులు చేసిన తరువాతే అధికారులు అధికారికంగా పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆలయాల్లో అపచారాలకు తావులేకుండా అగమ శాస్త్రబద్ధంగా నడిచేలా ఈ ఉత్తర్వులు ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఆలయాల పవిత్రత, ఆగమశాస్త్రాన్ని కాపాడి భావితరాలకు అందించేలా జీవో ఉందన్నారు.



# బెంగళూరులో చెరువుల పునరుద్ధరణ హైడ్రా అధ్యయనం

**- చేపట్టిన చర్యలపై అక్కడి అధికారులతో కమిషనర్ రంగనాత్ వీడియో కాన్ఫరెన్స్**

**- పరిశీలనకు వెళ్లనున్న తెలంగాణ అధికారులు**



హైదరాబాద్, (ప్రజా మంటలు): చెరువుల పునరుద్ధరణ కోసం చేపట్టిన చర్యలపై అధ్యయనానికి హైడ్రా అధికారులు బెంగళూరు వెళ్లాలని చూస్తున్నారు. అక్కడ అతి తక్కువ ఖర్చుతో చెరువులకు జీవం పోసిన విధానాన్ని పరిశీలించాలని కమిషనర్ రంగనాథ్ నిర్ణయించుకున్నారు. ఈ మేరకు లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఆనంద్ మల్లిగవాడ్‌తో తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమైన రంగనాథ్ బెంగళూరులో 35 చెరువుల పునరుద్ధరించిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బెంగళూరులో ఏర్పాటు చేసిన విధానంపై హైడ్రా : ఆనంద్?ను హైదరాబాద్?కు పిలిపించి ఇక్కడ చెరువుల పునరుద్ధరణపై సహకారం అందజేయాలని రంగనాథ్ కోరారు. అలాగే చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి స్వచ్ఛమైన నీరు చెరువుల్లోకి చేరేలా ఏర్పాట్లు చేయాలని హైడ్రా నిర్ణయించింది. మురుగు నీటి కాలువల నుంచే శుద్ధి చేసే ప్రక్రియను ప్రారంభించి చెరువులోకి చేరే ముందు మూడు నాలుగు దశల్లో నీరు ఉంచి ఫిల్టర్ చేసిన తీరుపై హైడ్రా దృష్టి పెట్టనుంది. మురుగు నీటి కాలువలకు రెండు వైపులా మొక్కలు నాటడం, చెరువుకు చేరేలోపే కొంతమేర శుద్ధి జరిగేలా బెంగళూరులో ఏర్పాటు చేసిన విధానంపై అధ్యయనం చేయనుంది. చెరువుల పునరుద్ధరణ కోసం స్థానికులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కల్పించి వారికే నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛందంగా తీసుకునేలా హైడ్రా కసరత్తు చేస్తోంది.నెల రోజుల పాటు కూల్చివేతలకు విరామం ఇచ్చిన హైడ్రా, ఈ సమయంలో మహానగరం పరిధిలోని ప్రతి చెరువు చరిత్రను వెలికి తీయాలని నిర్ణయించింది. ఇందులో సుమారు 200 మంది అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. దీనికి అత్యాధునిక వ్యవస్థలను ఉపయోగించనున్నారు. భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకుండా రియల్ టైం లొకేషన్ వ్యవస్థనూ అందుబాటులోకి తేవడానికి హైడ్రా కసరత్తు చేస్తోంది. మరోవైపు ఇప్పటికే కూల్చివేతలు చేపట్టిన చెరువుల సుందీరకరణ పనులను ఈ వారంలో మొదలు పెట్టాలని నిర్ణయించింది. డిసెంబర్ నెలాఖరు నాటికి కొన్ని చెరువుల సుందరీకరించి, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించాలని అనుకుంటున్నారు.

# నోబెల్ సాహిత్యం విజేత హాన్‌కాంగ్

## - దక్షిణ కొరియా రచయితకు అత్యున్నత పురస్కారం

స్టాక్‌హోం (ప్రజా మంటలు): దక్షిణ కొరియా రచయిత హాన్‌కాంగ్‌ను సాహిత్యంలో నోబెల్ బహుమతి వరించింది. గత మూడు రోజులుగా సైన్స్ విభాగాల్లో బహుమతులు ప్రకటిస్తున్న నోబెల్ బృందం వరుసగా గురువారం సాహిత్యంలో ఈ అవార్డును ప్రకటించింది. చారిత్రక గాయాలను ఎదుర్కొంటూ, మానవ జీవితంలోని దుర్బలత్వాన్ని బట్టబయలు చేసే హృద్యమైన కవిత్వానికి నోబెల్ బహుమతి లభించింది. కాగా, దక్షిణ కొరియా రచయిత నోబెల్ బహుమతికి ఎంపిక కావడం ఇదే మొదటిసారి. 53 ఏళ్ల హాన్ కాంగ్ 1993లో 'లిటరేచర్ అండ్ సొసైటీ' అనే మ్యాగజైన్‌లో అనేక కవితలను ప్రచురించడం ద్వారా తన వృత్తిని ప్రారంభించింది. 1995లో 'లవ్ ఆఫ్ యెయోసు' అనే చిన్న కథా సంకలనంతో ఆమె గద్య ప్రవేశం జరిగింది, ఆ తర్వాత అనేక ఇతర గద్య రచనలు, నవలలు మరియు చిన్న కథలు రెండూ వచ్చాయి. 2016లో 'ది వెజిటేరియన్' అన్న నవలకు అంతర్జాతీయ బుకర్ ప్రైజ్‌ను గెలుచుకున్నారు. మాంసాహారం మానేయాలని మహిళ తీసుకున్న నిర్ణయం వల్ల కలిగిన వినాశకరమైన పరిణామాలను ఈ నవల వివరిస్తుంది. సాహిత్యంలో నోబెల్ బహుమతిని 1901 నుండి ప్రదానం చేస్తున్నారు, సంవత్సరాలుగా 120 మంది గ్రహీతలతో. మొత్తం 116 సార్లు అవార్డు అందించబడింది, వారిలో 103 మంది పురుషులకు మరియు 17 మంది మహిళలకు మాత్రమే ఉన్నారు ? ఇది బహుమతి చరిత్రలో కొనసాగిన అద్భుతమైన లింగ అసమానత.అమెరికన్లు విక్టర్ అంబ్రోస్ మరియు గ్యారీ రువ్కున్ అక్టోబర్ 7న మెడిసిన్ బహుమతిని గెలుచుకోవడంతో నోబెల్ ప్రకటనలు ప్రారంభమయ్యాయి. జాన్ హాప్‌ఫీల్డ్, జియోఫ్రీ హింటన్ మంగళవారం ఫిజిక్స్ నోబెల్ గెలుచుకున్నారు. బుధవారం, నవల ప్రోటీన్‌లను డీకోడ్ చేయడానికి మరియు రూపకల్పన చేయడానికి శక్తివంతమైన పద్ధతులను కనుగొన్న ముగ్గురు శాస్త్రవేత్తలకు రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. నోబెల్ శాంతి బహుమతిని రేపు ప్రకటించనున్నారు. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని అక్టోబర్ 14న ప్రదానం చేయనున్నారు. 1901 నుండి ప్రతి సంవత్సరం శాస్త్రాలు, సాహిత్యం, శాంతిలో సాధించిన విజయాలకు నోబెల్ బహుమతిని ప్రకటిస్తున్నారు. డైనమైట్‌ను కనిపెట్టిన స్వీడిష్ రసాయన శాస్త్రవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ వీలునామా మేరకు ఈ బహుమతిని ఏర్పాటు చేశారు.




# కాంగ్రెస్‌కు కలసి రాని ఒంటరి పోరు

**కూటమి పోటీతోనే మంచి ఫలితాలు**

**విధానాలు మార్చుకుంటేనే కాంగ్రెస్‌కు భవిష్యత్**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): హిందీ హార్ట్‌ల్యాండ్‌గా పేరుగాంచిన ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నేటికీ పట్టు సాధించలేకపోతోంది. గత పదేళ్లలో చత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అధికారం అందినా ఐదేళ్ల తర్వాత రెండోసారి గెలుపొందలేక పోయింది. ఇందుకు కారణాలను ఆ పార్టీ విశ్లేషించుకోవడం లేదు. కేవలం ఇవిఎంలపైననో లేదా మోడీపై ననో విమర్శలు చేస్తూ తప్పించుకోవడం కుదరదు. ఓటమికి కారణాలను కనుగొనాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి. అదేపనిగా మోడీని తిడుతూ కూర్చుంటే గెలవలేమని గుర్తించాలి. రాజకీయాల తీరు తెన్నులు మారేలా నడుచుకోవాలి. అప్పుడే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పట్టు సాధిస్తే తప్ప జాతీయ రాజకీయాల్లో విజయాలు సాధించలేమని ఆ పార్టీ వ్యూహకర్తలకు తెలుసు. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రం నానాటికీ బలపడుతూ హిందీ రాష్ట్రాల్లో గట్టి పట్టు సాధిస్తూ ముందుకు కదులుతోంది. గత మూడున్నర దశాబ్దాల్లో బీజేపీ 2 పర్యాయాలు సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ మార్కు దాటింది. ఈసారి కాస్త 30కి పైగా పార్టీలతో ఏర్పడ్డ ఇండి-కూటమిని ఎదుర్కోవడంలో కాస్త తడబడాల్సి వచ్చింది. త ఏడాది 34 పార్టీలతో ఏర్పాటైన ఇండి-కూటమి అనేక రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. 15 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బీజేపీని ఢీకొట్టింది. వాటిలో దక్షిణాదిన కర్ణాటకలో మాత్రమే నేరుగా బీజేపీతో తలపడగా, మిగతా రాష్ట్రాల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు, కూటములతో తలపడింది. కర్ణాటకలో బీజేపీ మీద, తెలంగాణలో బీఆర్ఎస్ మీద మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి 20కి 18 చోట్ల గెలుపొందింది. తమిళనాడులో మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగంతో కలిసి గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయింది. ఇక, ఉత్తరాది రాష్ట్రాల్లో ... బిహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్‌లో స్థానికంగా బలంగా ఉన్న మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. బెంగాల్‌లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసినా ఆ రాష్ట్రంలో ప్రధాన పోరు తృణమూల్ కాంగ్రెస్ , బీజేపీ మధ్యనే సాగింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో జట్టుకట్టినా, ఆ స్నేహం పంజాబ్‌లో అమలు కాలేదు. అయితే కొన్ని చోట్ల ఈ కూటములు, పొత్తులు ఫలించి కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ బాల్ థాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం)తో కలిసి కొన్ని సీట్లు, యూపీలో సమాజ్‌వాదీ పార్టీ తో కలిసి కొన్ని కాంగ్రెస్ ఖాతాలో అదనంగా చేరాయి. హర్యానా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవిగా మారిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 99 సీట్లలో సగం వరకు మిత్రపక్షాల బలంతోనే వచ్చాయని సూత్రీకరించారు. అయితే మిత్రపక్షాలు కాంగ్రెస్‌పై ఆధారపడిన రాష్ట్రాల్లో వారి ఎన్నికల నౌకలు మునిగిపోయాయాని తెలిపారు. కాంగ్రెస్ ఎంత పరాన్నజీవి అంటే అది తన సొంత మిత్రులను మింగేస్తుందని మోదీ విరుచుకుపడ్డారు. తన గెలుపు కోసమే పొత్తు.. తాను ఒంటరిగా గెలిచేలా ఉంటే ఎవరూ వద్దు అన్నది కాంగ్రెస్ విధానంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు ఆ పార్టీని వరుస ఓటములతో ముంచేస్తోంది. ఈ తరహా రాజకీయాలు కాకుండా కలిసి పోరాడే విధంగా పార్టీని బలోపేతం చేసుకోవాలి. కులరాజకీయాలు, కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టాలి. సమిష్టి రాజకీయాలకు పెద్దపీట వేయాలి. ఆ దిశగా కాంగ్రెస్ అడుగులు వేయగలిగితేనే మంచి ఫలితాలు వస్తాయి.



## ఏపీలో బీజేపీ నేతల నగ్న వీడియోలు కలకలం

**- వీడియో వ్యవహారంపై అధిష్టానం విచారణ**

**- వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశం**

గుంటూరు (ప్రజా మంటలు): గుంటూరు జిల్లాలలో ఇద్దరు బిజెపి నేతల నగ్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బిజెపి పార్టీకి చెందిన మహిళతో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వీడియో కాల్ మాట్లాడుతూ నగ్నంగా కనిపించిన వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ వీడియో బయటకు రావడంతో బిజెపి నాయకత్వం అప్రమత్తమైంది. వీడియో వ్యవహారంపై విచారణ చేసి తమకు నివేదిక ఇవ్వాలని పార్టీ పెద్దలు ఒక నాయకుడికి అప్పగించినట్టు సమాచారం. గుంటూరు పార్టీ జిల్లా ముఖ్య నాయకుడి వీడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. రెండు వీడియోలు బిజెపి నేతలవి బయటకు రావడంతో బిజెపి ఉలిక్కిపడింది. రెండు వీడియోలు సోషల్ మీడియాలో రావడం వెనుక ఆ పార్టీ నేతల హస్తం ఉన్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. 2022వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం వైఎస్ఆర్ సిపి ఎంపి గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన విషయం తెలిసిందే. అప్పట్లో అది ఫేక్ వీడియో అని పోలీసుల విచారణలో తేలింది.

## లావోస్ చేరుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోడీ లావోస్ చేరుకున్నారు. లావోస్ ప్రధాని సోనెక్స్ సిఫాండోస్ ఆహ్వానం మేరకు మేరకు లావోస్ చేరుకున్న ప్రధాని రెండు రోజుల పాటు అక్కడ పర్యటించనున్నారు. ఆసియాన్- ఇండియా సమ్మిట్, తూర్పు ఆసియా సదస్సుల్లో ప్రపంచ నేతలతో చర్చల కోసం ఎదురుచూస్తున్నానని ప్రధాని గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిని సమీక్షించ డానికి, సహకారం భవిష్యత్తు దిశను రూపొందించడానికి ఆసియన్ నేతలతో చర్చిస్తానని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## రిజర్వేషన్ల వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టండి

**- మందకృష్ణ డిమాండ్**



హైదరాబాద్, (ప్రజా మంటలు): మాదిగలను నమ్మించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ని ప్రకటనలు చేసినా, నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు.ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకుండానే 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్లకూ వర్గీకరణ వర్తింపజేస్తామని చెప్పి, అమలు చేయకుండానే టీచర్ పోస్టులు భర్తీ చేశారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి శాసనసభలో చెప్పిన మాటలకే విలువలేదని విమర్శించారు.శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తామంటే అనుమతి ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వమే కాదు.. రేవంత్ ప్రభుత్వం కూడా నిర్బంధాలతోనే నడుస్తోందని ఆరోపించారు. గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలకు వర్గీకరణ వర్తింపజేయాలని.. లేదంటే వర్గీకరణ తర్వాతే గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని, గ్రూప్-3 పరీక్షలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-4 ఫలితాలు ఇప్పటికే 16 నెలలు ఆగాయని, వర్గీకరణ జరిగే వరకు మరో 2 నెలలు వాయిదా వేయాలని కోరారు.ఈ నెల 16న వరంగల్‌లో భారీ సమావేశం నిర్వహిస్తామన్న ఆయన.. ఆ సమావేశంలో అన్ని కమిటీల సభ్యులు పాల్గొంటారని అన్నారు. ఇప్పటివరకు ఆవేదనతోనే నిరసన చేశామని.. ఇకపై తమ ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.

## కమలా హారిస్ ప్రచారానికి విరాళాల వెల్లువ

**- 1 బిలియన్ డాలర్లు వసూలు**

న్యూయార్క్ (ప్రజా మంటలు): వచ్చే నెలలో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ అభ్యర్థిగా కమలాహారిస్‌లు బరిలో ఉన్నారు.ఈ క్రమంలో హారిస్‌కు భారీస్థాయిలో మద్దతు వస్తున్నట్లు తెలుస్తోంది. ఆమె అభ్యర్థిగా బరిలో నిలిచినప్పటినుంచి ఆమె ప్రచారానికి 1 బిలియన్ డాలర్ల విరాళాలు అందాయి.ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ బరిలో నిలిచినప్పటినుంచి ఆమె పూర్తిస్థాయి ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఇందులోభాగంగా ఆమె అభ్యర్థిగా పేర్కొన్న రోజున 25 మిలియన్ డాలర్లు అందాయి. దాదాపు ఒక నెలలోనే 500 మిలియన్ డాలర్లు సేకరించారు. ఇక, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు గత ఆగస్టులో 130 మిలియన్ల రాగా.. అదేనెల చివరాఖరున 294 మిలియన్ డాలర్లు సేకరించగలిగారు.అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి జోబైడెన్ వైదొలిగి ఆయన స్థానంలో కమలాహారిస్ పేరును ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అమె అభ్యర్థి అవుతారని అన్నప్పటినుంచి డెమోక్రటిక్ పార్టీ పెద్దఎత్తున విరాళాలు అందుతున్నాయి. వచ్చే నెలలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా డెమోక్రటిక్, రిపబ్లికన్ పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com